

## గురుదేవా!

ఏ సుకృతము చేసుకున్నాము...
మీ చరణకమలాల చెంత మాకింత చోటు దొరక!
ఏ పురాణేతిహాసాల అధ్యయనము చేసాము...
మీ పావన నామము తలచుకొన!
ఏ సుజ్ఞానముల సారము జీర్ణించుకున్నాము...
మీ సుమనోహర మోము చూడ!
ఏ వేదమంత్రముల పారాయణ దీవించె...
మీ అనుగ్రహభాషణము వీనుల చేర!
ఏ సమున్నత దైవకార్యములు చేశాము...
సర్వాంతర్యామివైన మీ స్పర్శ మము తాక!
ఏ సత్ పథముల బాట నడిచాము...
మీ అడుగుజాడలు అనుసరించ!
ఎన్ని జన్మముల, ఏ తపములాచరించాము...
అతి పవిత్రమైన మీ పాదధూళి మా తలనిడ!
మమతానుబంధమా? మహితానుబంధమా?
శ్రీసాయి మాతృత్వ కరుణానుబంధమా? ...

**- సద్గురు నంది -**

శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!

# గురుకృప

విజయదశమి సంచిక





శ్రీసాయి ఇలా అన్నారు.....

"అడిగిన వారికి అడిగినంత సమృద్ధిగా ఇవ్వమని
నా యజమాని నన్ను ఆదేశించారు. కానీ నా మాటలు చెవినబెట్టేదెవరు?
నా ధనాగారపు తలుపులు బార్లా తెరచి పెట్టి ఉంచాను.
కానీ ఆ సంపదను తీసుకొని పోయేవారే లేరు.
ప్రజలు ఊరకే నా వద్ద కొచ్చి 'ఇవ్వు! ఇవ్వు' అంటారు,
నేను తీసుకోమంటాను, కానీ తీసుకునే వారేరీ"

## సాయి ఊసు - సాయి ధ్యాస



**గురువుగారు:** మీకు ఇష్టం ఉంది. ఆ ఇష్టాన్ని పెంచుకునేదానికి సత్సంగం ఉపయోగపడుతుంది. ఇష్టం లేకపోతే ఇష్టాన్ని పుట్టించేటువంటిది కాదు. ఆ పెంచుకోవడమనేటువంటిది మీకు ఇష్టం కనుక. పాతరోజుల్లో పొయ్యి రాజేసేవాళ్ళు. ఇప్పుడు రాజెయ్యడం లేదులే. ఒకవైపు కిరోసిన్ పోసి ఉఫ్ ఉఫ్ అని ఊదే వాళ్ళు, ఊదడమనేటువంటిది ఇంకా పెద్దమంట కావడానికి. చిన్నమంట పెద్దమంట కావడం కోసం ఈ సత్సంగాలనేటటువంటివి, ఉఫ్ ఉఫ్ అని ఊదడంలాంటివి. అది బాగా మండి వంట చేయడానికి పదిమందికి ఉపయోగ పడుతుంది. ఉఫ్ మని ఊదకుండా వదిలేశామనుకో-వండటానికి మాత్రం మంట మండుతుంది, కానీ పోతుంది.

**భక్తుడు:** ప్రతిరోజూ బాబా ముందు కూర్చోవట్లేదని గిల్టీగా అనిపిస్తుంది.

**గురువుగారు:** కూర్చోవడమే కాదు, మనమేం చేసినా ఇందాకా నేను చెప్పాను కదా ఆ ధ్యాస... "సాయి ఊసు - సాయిధ్యాస". అంతే తప్పితే బిగదీసుకొని నువ్వు ఎంతసేపు కూర్చున్నావన్నది లెక్క కాదు. నువ్వు నిలబడేటప్పుడు ఏం చేస్తున్నావనే దాని మీదనే కూర్చోవడం ఆధారపడి ఉంటుంది. 20 నిమిషాల పాటు మీరు ధ్యానంలో కూర్చుంటే, ఆ 20 నిమిషాలపాటు ధ్యానం కుదరాలి, బాబాపట్ల మీకా ధ్యాస కుదరాలి అనంటే మిగతా 23 గంటల 40 నిమిషాల పాటు మీరేం చేశారనే దాని మీద ఆధారపడి ఉంటుంది. అది సరిగ్గా చేస్తే ఇది కుదురుతుంది. ఇది కుదిరిందంటే దాన్ని ఇన్‌ఫ్లూయెన్స్ చేస్తుంది. మళ్ళా అది కరెక్ట్‌గా ఉంటే ఇది ఇన్‌ఫ్లూయెన్స్ అవుతూ పోతుంటుంది. ఇట్లా ఒకదానికొకదానికి కాంప్లిమెంటరీగా పోతుంటాయి. అంతే తప్పితే మనం మిగతా టైంలో ఏమైనా చేసేసి ఆ 20 నిమిషాల సేపు హ్యాపీగా కూర్చుంటామంటే వీలుపడదు. మనకంటూ ఒక గోల్ ఉంటే, ఆ గోల్ వైపుకి మనం అడుగేస్తున్నామా లేదా చూసుకోవడం. చెత్త వేయడం, చెత్త పోగేసుకోవడం. ఇటువంటివి తగ్గిస్తే ఆటోమేటిక్‌గా అట్లా కూర్చుంటే ఇట్లా నిలుస్తుంది ధ్యానం, అంతే, ఏం చేయనక్కరలేదు.

మీరు 20 గంటలు పని చేయండి. ఏమీ ఇబ్బంది లేదు. ఈ కూర్చోవడమే కాకుండా బాబాకి సంబంధించినటువంటి ఏదైనా యాక్టివిటీ చేసినపుడు, అది నేను చెప్పిన ఊసు, ధ్యాస! అట్లాగే కదలకుండా బాబా ఫోటో వైపే కళ్ళు ఆర్పకుండా చూస్తున్నామనుకోండి. ఏమవుతుంది? కన్నీళ్ళు వస్తాయి. అంతకంటే ఏం కాదు. ఇప్పుడు ఇందాకటి నుంచి మీరు నన్ను చూస్తున్నారు. నా మాటలు వింటున్నారు. కళ్ళార్పకుండా ఏమైనా వింటున్నారా? కళ్ళు ఆర్పుతున్నారు, కదులుతున్నారు, చూస్తున్నారు. అయినా కూడా కంటిన్యూస్‌గా నన్ను చూస్తూనే ఉన్నారు. అదీ బాబాను చూడటమంటే. ఆ ధ్యాసలో ఉండటం, ఆ ఊసులో ఉండటం!

*-శ్రీబాబూజీ సత్సంగ సుమాలు*

## నిశ్చింతగా ఉండటం



**భక్తుడు :** గురువుగారూ, గురువుకు పగ్గాలు అప్పగించి నిశ్చింతగా ఉండటం అంటే?

**గురువుగారు :** మనం గురువు అని ఒకరిని అనుకున్నప్పుడు, ఇక మన మంచి చెడ్డలు ఆయన చూసుకుంటారు అని హ్యాపీగా ఉండగలగాలి. మనం అప్పజెప్తాంగానీ, నిశ్చింతగా ఉండము. వచ్చిన సమస్య అది. డ్రైవర్‌ని పెట్టుకుంటాం, బ్యాక్ సీట్లో కూర్చుంటాం. స్టీరింగ్ అప్పజెప్తాం. వాడు సరిగ్గా డ్రైవ్ చేస్తున్నాడా లేదా అని చూస్తుంటాం. అరే లైట్ వెయ్యి, లెఫ్ట్‌కి పో, రైట్‌కి పో, బ్రేక్ వెయ్యి, స్లోగా పో, ఈయన నన్ను సరిగ్గా చూసుకుంటాడో లేదో అసలు ఈయనకు చేత అవుతుందో లేదో? అని 24 గంటలూ....

బాబా నన్ను ఇలా చేసి నా కోరికను ఇలా తీర్చి, అలా తీరిస్తే నేను బావుంటాను. బాబా అలా చెయ్యి అనంటాం. నాకు ఉద్యోగం కావాలని అడగము. ఫలానా వాడి దగ్గరకు ఈ అప్లికేషన్ కరెక్ట్‌గా టైంకి చేర్చి, వాడికి అట్లా చెయ్యాలని బుద్ధి పుట్టించి, ఇలా ఆయనకు సూచనలు ఇస్తామన్నమాట. ప్రొసీజర్ కూడా మనమే చెప్తాం. నిశ్చింతగా ఉండలేకపోతున్నాం. ముందు పగ్గాలప్పచెప్పడమే పెద్ద గొప్ప. అప్పచెప్పినా నిశ్చింతగా ఉండలేము. అందుకని ఆయన రెండూ చెప్పారు. అప్పచెప్పి నిశ్చింతగా ఉండండి. హ్యాపీగా ఉండండి. అదే పగ్గాలు అప్పచెప్పడమంటే. దానికి రమణమహర్షి చెప్పిన ఉదాహరణ రైల్వే ఫస్ట్‌క్లాస్ ట్రావెలర్‌లాగా ఉండండి అని చెప్తారు. థర్డ్ క్లాస్ ట్రావెలర్ ఏం చేస్తాడు?

ఎక్కిన తరువాత నెక్స్ట్ స్టేషన్ వచ్చిందా అని చూసుకుంటుండాలి. నిద్రపోలేడు, నిద్రపోవడానికి అసలు సీటే ఉండదు. ఒకవేళ ఉన్నా వాడు ప్రతి స్టేషన్‌లో లేచి చూసుకుంటుండాలి. ఫస్ట్‌క్లాసు ట్రావెలర్‌లు అట్లా కాదు. వెళతాడు, కూపే తీసుకుంటాడు. లాక్ చేసుకుంటాడు. కరెక్ట్‌గా 10 నిమిషాల ముందు టి.సి. వస్తాడు, సార్, మీ స్టేషన్ 10 నిమిషాలలో వస్తుంది సార్ అంటాడు. ఇతను లేచి బ్యాగ్ తీసుకొని స్టేషన్ దిగిపోతాడు అంతే. అట్లా సద్గురువును ఆశ్రయించడమనే ఫస్ట్‌క్లాస్ టికెట్టు కొనుక్కో. హ్యాపీగా కూపేలోకి ఎక్కి నిద్రపో. ఆ గమ్యం వచ్చిన తరువాత ఆయనే తట్టిలేపుతారు. 'నిన్ను చివరికంటా గమ్యం చేరుస్తాను' అని బాబా చెప్పినమాట. గమ్యం చేరిన తరువాత ఆయనే చెప్తారు. నీ స్టేషన్ వచ్చింది దిగవోయ్ అంటారు. అదీ నిశ్చింతగా ఉండటం అంటే! దీంట్లో ఇంపార్టెంట్ థింగ్ నిశ్చింతగా ఉండటం. మనలో చాలామంది పగ్గాలు అప్పచెప్పినట్టు అనుకుంటారు కాని, నిశ్చింతగా ఉండలేరు. ఈ రెండూ జరగాలి.

**భక్తుడు :** ఆ నిశ్చింత ఎట్లా వస్తుంది? అంటే అనుభవం ద్వారా వస్తుంది?

**గురువుగారు :** మనకు ఆయన సద్గురువు అని తెలిస్తే చాలు. ఆయన మంచి డ్రైవర్ అని తెలిస్తే చాలు. నిద్రపోతావు.

**భక్తుడు :** గమ్యం చేరడమంటే ఏంటి సార్?

**గురువుగారు :** మనకేమీ కొరత లేకుండా ఉండేటువంటి ఆనందస్థితిని పొందడం! అది ఏదైనాగానీ, దానికి ఏ పేరైనా పెట్టుకో. ఇక ఇది కావాలి అని మనకేదీ అనిపించదు. తన్నుకొస్తుంటుంది ఆనందం, వద్దనుకున్నా వస్తుంటుంది. ఆ ఆనందమైనటువంటి స్థితి. ఒక Ecstatic bliss, an ecstatic rapture of bliss, a rapturous ecstacy. అది పొందేదాకా!

*-శ్రీబాబూజీ సత్సంగ సుమాలు*



ప్రకారం కూడా ఏది ప్రాధమికమో, మౌలికమో తెలుస్తున్నది కదా.

పైన పేర్కొన్న సత్సంగ భాగంలోనే "Often, people give more importance to the seconday dharma and forget the primary spirit behind it, the fundamental purpose behind all their acts." అన్న గురువు గారి మాటలు ఈ విషయం గూర్చి మరింతగా ఆలోచింపజేశాయి.

అలా సద్గురువుకు శరణాగతి చెందడంలోని పరమార్థాన్ని గ్రహించకుండా... మన focus ఇతర విషయాలపై వైపు.... ధర్మసందేహాలవైపు... so-called ధర్మ పోరాటాలవైపు... దారి తీయడానికి గల కారణాలు ఏమిటా అని మది కలవరపడింది. జాగ్రత్తగాగర్తగా గమనిస్తే.... నిష్పాక్షికంగా అవలోకిస్తే, మన నేపథ్యం, మన అలవాట్లు, మన బలాలు, బలహీనతలు, మన ఆలోచనా ధోరణి, ఏ విషయాన్నైనా మనం గ్రహించే విధానం మొదలైన ప్రభావాల వలన సాధారణంగా మనం, మనకంటూ ఏర్పరచుకున్న ఒక విలువల చట్రంలో నుంచి అన్నింటినీ చూస్తూ.... ఆ చట్రంలోకి 'బ్రహ్మాండాన్ని' ఇమడ్చాలని చూస్తాము.... మన frameలోకి ఇమిడింది కరెక్టని..... ధర్మమని..... మనకు సమన్వయపడని విషయం తప్పని..... మనం నమ్మిన సత్యానికి .... సిద్ధాంతానికి విరుద్ధమని Conflictకి లోను అవుతాము. సర్వకాల సర్వావస్థలలోనూ సమన్వయపడేది.... మన frameని అంతకంతకూ విస్తృతం చేస్తూ ముందుకు తీసుకువెళ్లేది.... చివరకు జరిగేది..... చివర వరకూ నిలిచేది.... చివరికి మిగిలేది.... ఆ సద్గురు పాదాల చెంత నొందిన శరణాగతి ఒక్కటే..... అయితే, సద్గురువుకు శరణాగతి చెందాలి అన్న విషయం ఇంతకు ముందు కూడా తెలుసు కదా.... ఇప్పుడు కొత్తగా తెలిసింది ఏమిటి అన్న ప్రశ్న ఉదయించింది. ఇంతవరకు, శరణాగతికి సంబంధించి నాకున్న అవగాహన ఋణానుబంధం అన్న aspect మీద ఆధారపడి ఉంది.... నాకు సద్గురువుకు ఎన్నో జన్మల నుండి బంధం ఉంది కాబట్టి.... నేను ఆయనకు చెందిన వాడిని కాబట్టి..... ఆయన నన్ను అవ్యాజంగా ప్రేమించి సంరక్షిస్తున్నారు కాబట్టి..... ఆయన పట్ల మొదలైన ఇష్టం.... ప్రేమగా.... అనన్య భక్తిగా ఎదిగి శరణాగతికి దారి తీస్తుంది అని. అయితే అసలు మౌలికంగా, సార్వత్రికంగా 'శరణాగతి' అన్న దానికి వెనుక ఉన్న సూక్ష్మం ఇప్పుడు అవగతమైంది. అందుకేనేమో, గురువు గారు ఒక సందర్భంలో వ్రాసారు.... సద్గురు పథమంటే శరణాగతి పథమే అని..

**సద్గురు పదమ్ములే సకల ధర్మములు । సద్గురు పల్కులే సకల వేద సారములు ॥**
**సద్గురు సముఖమే స్వర్గ సుఖము । సద్గురు ప్రసన్నమే సకలైశ్వర్యము ॥**

*- శేఖర్, చెన్నై*

**విద్వత్తు విద్యుత్తు కన్నా తేజోవంతమైనది.**



సంపుటి : 22
సంచిక : 4

అక్టోబర్ 8
2019



గురుకృప



# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో



4 పథగామి - గురుకృప
8 అసహాయత - అనుగ్రహం - శరచ్చంద్రికలు
15 బాబూజీ - బాపూజీ - పవన్
18 అలనాటి ముచ్చట్లు - డా॥ జి.సాయివరప్రసాదరావు
22 గురుకృపాలహరి - గురుకృప
29 సద్గురు పదంబులే సకల ధర్మములు - శేఖర్

నిర్వహణ : **గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు**

**GURUKRUPA**
Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



## పథగామి

ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం – మానవ జీవితాలను సాయిప్రేమమయంగా, సాయి అనుగ్రహోదయంగా, సాయి కరుణోద్యానవనంగా సాగిన కాలఘట్టం – సత్యానుభవాన్ని, సాయి సత్యపథాన్ని జనసామాన్యపు జీవనప్రవంతిలో, ఆనందపు కాంతులతో ప్రసరించిన మహోదయం – మహిమాన్విత శుభతరుణం – శ్రీసాయినాధుని శరత్ బాబూజీగా ప్రభవించిన సాయి అరుణోదయం – ఇది అమృత సమయం. ఇదంతా అక్షరలాలిత్యమా? అవగాహనాసాహిత్యమా? అన్న ప్రశ్న మీకు ఉదయించవచ్చు. ఉపనిషద్వాక్యాలైన 'అభీః' – జంకు లేకుండా ఉండటం వంటి అంశాల నుండి ఈనాటి 'సానుకూల దృక్పథమనే' మేధోసంపన్నుల నవీనతత్త్వాల వరకు – సహేతుకంగా, సమున్నతంగా ఆచరించి, ఆచరింపచేస్తున్న అత్యంత అరుదైన పరిపూర్ణ మానుష రూపం శ్రీబాబూజీ. వారి జీవితమే పరిపూర్ణత్వానికి, మనిషి దైవంగా ఎదగడమన్న తత్త్వానికి తార్కాణమనడం సముచితం, సత్యం. నిజానికి వారి లీలా వినోదాలే, భక్తుల అనుభవాలే సచ్చరితలు, సత్యానికి త్రోవలు. శ్రీసాయినాథుని జీవిత దర్శనం చేస్తే ఏ సర్వవ్యాపక, సర్వసమర్ధ, సర్వజీవస్వరూపం కానవస్తుందో శ్రీబాబూజీ చెంతన అదే అనుభవాన్ని భక్తులు పొందగలిగారు. అయితే ఆ శరశ్చంద్రుడు తన అనుగ్రహ వెలుగుకు మూలం సాయిభానుడేనని సదా మాకు తెలియచెప్తుండేవారు. సద్గురు వాక్యం శృతివాక్యం కదా! శ్రీసాయి చరిత్ర మనందరికీ అత్యంత పూజ్యం కదా! గురుదేవులు ఎన్నో సందర్భాలలో 'చరిత్ర చదవడమెలాగో' – పరాయణత్వం లేని తంతుల 'పారాయణ'తో మనలో ఎట్టి ప్రగతి కలగదని తెలియచెపుతూ వచ్చారు. మహాత్ముని చరితానికి వారిచ్చిన ప్రాధాన్యం వారి మాటల్లోనే – **" 'శ్రీరమణలీల' పేరుతో తెలుగులో ప్రామాణికమైన భగవాన్ జీవితచరిత్రను రచించిన కృష్ణభిక్షు అనే భగవాన్ సన్నిహిత భక్తుడు ఒకసారి నాతో ఇలా అన్నారు. వారొకసారి భగవానులను, "భగవాన్, ఇప్పుడు మీ సన్నిధిలో మేమెంతో ఆనందంగా ఉన్నాము. మరి మీరు వెళ్ళిపోయిన తరువాత మా పరిస్థితి ఏమిటి?" అని ప్రశ్నించారట. దీనికి భగవాన్ తక్షణమే "దానికేముంది, చరిత్ర ఉంది కదా" అన్నారట. భగవాన్ తమ జీవితచరిత్రను దాదాపు తమకు ఒక సూక్ష్మమైన ప్రత్యామ్నాయంగా సూచించారు. అలా భగవాన్ మరోసారి, మహాత్ముల జీవితచరిత్రల ప్రాముఖ్యతను తెలియచేశారు."** మరో సందర్భంలో 'శ్రీసాయిలీల – శ్రీసాయిబోధ' వేరు వేరు కాదు. వారి లీలలే వారి బోధలు అని తెలియచెప్పారు శ్రీబాబూజీ.







## సద్గురు పదంబులే సకల ధర్మములు

సాయితత్త్వ సుజ్ఞానపెన్నిధి... మన గురుదేవుల సప్రేమ సన్నిధి. మహోత్క్రష్టమైన ఆ సన్నిధిని పునఃప్రసాదించే మహోచ్ఛిష్టము అయిన సత్సంగ సమాహారం Rose Petals (November 2015) చదువుతున్నాను. చివరిపేజీలో "All other dharmas are secondary, the real dharma is to surrender to Me, which is the fundamental dharma and you can leave all the other dharmas, all other acts of righteousness. If you can achieve this - the state of total surrender - all will follow naturally. Often, people give more importance to the secondary dharma and forget the primary spirit behind it, the fundamental purpose behind all their acts. Then, saints like Sai Baba come and direct our minds to our real nature. "Surrender to me, I will take care of you. Give me the reins of your life and I will take you to your destination". Always, with every word, Baba stresses the need for surrender అని ఉంది.

అది చదివిన వెంటనే నాకు ఒక సందేహం కలిగింది. అసలు సద్గురువుకు శరణాగతి చెందడం అన్నది fundamental అంటే ప్రాథమిక ధర్మం ఎట్లా అయ్యింది అని. దేశ, కాలమాన పరిస్థితులకు అనుగుణంగా మనం నమ్మి ఆచరించే ఏ ధర్మమైనా, ఈ ప్రాథమిక ధర్మం ముందు అప్రధానమే ఎట్లా అవుతుందా అనిపించింది. ఈ సత్యాన్ని నాకు అర్థమయ్యేలా సమన్వయము చేసుకోవడం ఎలా అన్న ఆలోచన మొదలయింది. నా సందేహాన్ని కొంతమంది గురుబంధువులతో కూడా పంచుకున్నాను. వాళ్ళ perspective లో సమాధానం దొరుకుతుందేమో అన్న ఆశతో. ఒక గురుబంధువు చెప్పిన ఆలోచన నాకు ఉపయోగపడింది. ఆ ఆలోచన ఈ విధమైన సమన్వయానికి దారి తీసింది. అది ఏమిటంటే...

సకల సృష్టికి ఆధారమైన ఆ భగవత్‌తత్త్వంతో సదా తాదాత్మ్యం చెంది ఉండే సద్గురువుకు శరణాగతి చెందడం... అన్నింటికీ ఆధారమైన ఆ సృష్టి ధర్మానికి శరణాగతి చెందడమే అవుతుంది. అందుకని మిగతా ధర్మాలన్నీ ఈ ప్రాథమిక ధర్మం తరువాతే ఆ ధర్మానికి లోబడే ఉంటాయి. గురువుగారు అన్నింటికీ బాబా మీద ఆధారపడి ఉండమని బోధించడం వెనుక కూడా ఈ సూక్ష్మమే ఇమిడి ఉంది అనిపించింది. ఎందుకంటే సకల జగత్తు ఏ Principle మీద ఆధారపడి నడుస్తుందో... ఏయే factors ఆ Principleని ప్రభావితం చేస్తాయో, ఆ అంశాలన్నింటినీ నియంత్రించే sourceకి శరణాగతి చెందడం కంటే ప్రాథమికమైన ధర్మం ఉంటుందా.

ఇంకా, అసలు మొదలు సృష్టి అంటూ ఒకటి ఉంటే, దానిని ఆధారం చేసుకొని కదా మనిషి, మనసు, బుద్ధి... ఆపైన సంఘం, సమాజం, ధర్మం, న్యాయం, నీతి, విలువలు మొదలైనవి. ఈఆర్డర్



ఆదరించిన తీరు, అతనిపట్ల చూపించిన ఆప్యాయాభిమానాలు – పరమాచార్య స్వామివారు మతానికంటే మానవత్వానికే విలువనిస్తారని – మరోసారి భక్తజనులకు అర్థమయింది. వారి ప్రతీ అడుగు ప్రబోధమే కదా! వారి ప్రతీ లీలా దీపస్థంభమే కదా!

మహాత్ముల ఆచరణకంటే ప్రబోధమేముంది? వారు నడిచి చూపిన బాట కంటే మార్గమేముంది? మనిషి మతాన్ని వాడుకోవడం మొదలుపెట్టిననాడు పతనం ప్రారంభమయ్యింది. జనహితం మరచిన నాడు మతం మనుషుల మధ్య ముళ్ళకంపలా పరిణమించింది. 'మతం' మత్తుమందు పుచ్చుకొని, 'హితం' మరిచి 'ఖతమ్' చేసే స్థాయికి దిగజారింది. 'గ్లాని' కల్గిన ప్రతీసారి, 'హాని' చేసే జీవులు చేరిన ప్రతీసారి–మౌనిగా, జ్ఞానిగా, ప్రేమవాహినిగా మహాత్ములు ఉద్భవిస్తూనే ఉన్నారు. అహం, అసూయ, అరిషడ్వార్గాల అలజడిలో అట్టుడుకుతున్న మనందరిలోనూ భక్తి, వివేక బీజాలను నాటి జీవితమంతా **"ప్రేమను పొందడం–ప్రేమను పంచడం"** అనే రెండు సద్విషయాలకే మనలను పరిమితం చేసి, అపరిమితమైన ఆ జగద్గురుచంద్రుల ఆశీఃసాగరంలో మనమందరం తడిసి, తన్మయమవ్వాలని ఆకాంక్షిద్దాం... సద్గురుచరణ ప్రాప్తిరస్తు... శుభం భవతు.

**– గురుకృప**

---

## సాయిప్రేమ తుమ్మెద... మకరందము మాకిచ్చు దేవర...

పదకవితా పితామహుడు అన్నమయ్య ఇలా అంటాడు
"వలెనన్న వాడేబో వైష్ణవుడు... వలపుతేనెబో వైష్ణవము" అని.
"ఎవరైతే విష్ణువు కావాలనుకుంటాడో వాడు, తన త్రికరణాలలో విష్ణువును నిలుపుకున్నవాడు,
విష్ణుపాదాల నుండి ఉద్భవించే మకరందాన్ని మాత్రమే గ్రోలాలనుకునేవాడు వైష్ణవుడు.
కేవల మాత్రాన ఊర్ధ్వపుండలములను ధరించిన వాడు వైష్ణవుడు కాలేడంటారు" అన్నమయ్య...
అన్నమయ్య మాట వింటే సాలోచన మొదలైంది ఎవరు సాయిభక్తుడంటే అని..
తన త్రికరణాలను శ్రీసాయికి అంకితం చేసిన నిజమైన సాయిభక్తులు మా గురుదేవులు...
తుమ్మెద మాదిరి సాయిజ్ఞాన మధువును ఆస్వాదించిన సాయిపథగామి మా గురుచంద్రులు...
అట్టి పథాన నడవాలన్న ఆసక్తి గలవారిని నడిపి,
తమంత వారిని చేసే అనుగ్రహరాశి – శ్రీబాబూజీ





'సరే ఇంతకీ మనం మహాత్ముల చరిత్రలను ఎలా చూస్తున్నాం – ఏం చేస్తున్నాం'?

**మన పరిస్థితి – మనఃస్థితి :** "ఒకానొక మహత్తర అంశాన్ని కూలంకషంగా అధ్యయనం చేసి, అపారమైన దాని తత్త్వాన్ని ఆకళింపు చేసుకొనే సాధన"మైన పారాయణ, తన అవ్యాజమైన ప్రేమతో మన ప్రగతి కోసం సృష్టినే శాసించే ఆ 'పర'తత్త్వ పరాత్పరుని తెలుసుకునే పారాయణ – మన కోర్కెలు తీర్చే 'గైడ్'లా కనిపించడం మొదలయ్యింది. ఎప్పుడయితే కోర్కెలు తీర్చడమే ప్రధానాంశంగా మారిందో పారాయణ తంతుగా మొదలయింది. శ్రీబాబూజీ మాటల్లోనే **"పారాయణ అంటే, స్నానం చేసి, వ్యాసపీఠం దగ్గర కూర్చుని, అగరుబత్తి వెలిగించి, మొత్తం పుస్తకాన్ని ఏడు భాగాలుగా విభజించి, ఫలానా పేజీదాకా మొదటిరోజుకి అనుకొని, ఆ పేజీలో ఒక వేలుంచి పేజీలు తిప్పడం కాదు. అప్పుడు ఆ ఫలానా పేజీ మీదే వుంటుంది దృష్టి. ఇక చరిత్రలోని సారాంశం మనసుకేం పడుతుంది?"** ఇది ఎలాంటిదంటే చిన్న పిల్లాడు ఇంట్లో చదువును వల్లె వేస్తున్నాడు "క్యారెట్ తినడం ఆరోగ్యానికి మంచిది – అందులో ఎ, కె, బి6 లాంటి విటమిన్‌లు ఉంటాయి – అవి మన కంటికి, వంటికి ఉపయోగము" అని. అమ్మ క్యారెట్ పెట్టదు – వీడు తినడు. కొన్నాళ్ళు గడిచాక దృష్టి లోపంతో ఇబ్బందులు వాడికి. ఇదే వరుస పెద్దయ్యాక కూడా! "భాగవతం చదివితే బాగవుతామని, గీత అర్థమయితే నుదుటి గీతలతో పనిలేదని, సచ్చరిత చదివితే గ్రహాల గురించిన చింత కలుగదని" మనసుకు పట్టడం లేదు. చరిత్ర చదివి తెలుసుకుంటున్నామేగానీ ఆచరించడం లేదు. ఒక అడుగు ముందుకు వేసి "వాళ్ళు మహాత్ములు కదండీ! మనకు సాధ్యం కాని పని అది!" అని సాగదీస్తున్నాం, తెలిసి కూడా సత్యపథాన్ని, శ్రేయోమార్గాన్ని విడిచి నడుస్తున్నాం. ఆలోచిస్తే "మోయలేని బరువును తల్లి బిడ్డకు ఇవ్వడం ఎప్పుడైనా జరిగిందా?" ఇహంలో చదువులను భుక్తికి పరిమితం చేస్తున్నాం, ఇహాన్ని ఆనందమయంగా చేయగల సద్గ్రంథాన్ని పుణ్యంకోసం, కోర్కెల కోసం పరిమితం చేసేస్తున్నాం. ప్రేమ స్వరూపం కదా సద్గురుచంద్రులు శ్రీబాబూజీ – ఇదిగో ఒక జిజ్ఞాసువు ప్రశ్నకు వారి సమాధానం. "గురువుగారూ! కొన్ని రోజులుగా ఏదైనా ఇబ్బందిని ఎదుర్కొంటూ ఉన్నప్పుడు సచ్చరిత్ర చదవగానే ఆ ఇబ్బంది తొలగిపోతుంది. మేం చేసిందేం లేదు, మాలో మార్పేమీ లేదు. సచ్చరిత్ర చదివామంతే. బాబా అలా చదివినందుకే ఇచ్చేస్తారా?" ఇదిగో శ్రీవారి సమాధానం– **"సచ్చరిత్ర చదివినంతలో, అంటే ఆ కొద్ది సమయంలోనన్నా, బాబా మీద నీ మనసు పడింది. చదివినటువంటి మూడుగంటల్లో కొన్ని క్షణాలు అయినా మనకు తెలియకుండానే బాబా పట్ల**



మనసుపోయి ఉంటుంది. దానికే అంత రిజల్ట్ వచ్చింది. ఇంక నిజమైన బాబాతత్త్వాన్ని గురించి మనం ఈ రకంగా ఆలోచిస్తే అవగాహన తెచ్చుకుంటే ఇంకా ఎంత వస్తుంది? దీనికే ఇంతిస్తే దానికింక ఎంత రావాలి? లేకపోతే పుస్తకం చదివితే ఫలితం రావడమేమిటి అనే ఆలోచన మీకు రావాలి మామూలుగా అయితే. పుస్తకం చదివితే కళ్ళనొప్పులు రావాలి. అనుభవం రావడం ఏమిటి? కాబట్టి ఇక్కడ ఏదో ఉంది.

ఈ పుస్తకం చదవడం వలన ఇంకేదో మార్గం తెలుస్తుంది. బాబా ఎందుకు మనకు ఇచ్చారు? కాబట్టి దానికే అంతిస్తే ఇంక నిజంగా బాబాకు నచ్చింది మనం చేస్తే, ఆయన అన్నట్లుగా – "మీరు అడిగినదంతా నేను ఇస్తూనే ఉంటాను. నేను ఇవ్వదలచింది మీరు అడిగేంత వరకు" అని అన్నారు చూశారా, అది ఏంటో తెలుసుకోడానికి ప్రయత్నం చెయ్యెద్దూ, మనం? ఈ అవగాహన పెరుగుతూ, పెరుగుతూపోతే ఇంకా ఎంతిస్తారో! ఊరికినే అట్లా మనసు కుదిరింది ఆయన మీద, మనకు తెలియకుండానే – దానికే అంత అనుభవం వచ్చిందే! ఇక బాబా మీదే మనసు పెడితే ఇంకెంత వస్తుంది? అందుకే నేను పుస్తకం చదవద్దని చెప్పలేదు. పుస్తకం ఆ రకంగా చదవండని అంటున్నాను. ఇంకా ఎక్కువ ఫలితం వస్తుంది. అలాచేసి చూడండి, ఇంకా ఎంత వస్తుందో! మనం అర్థం లేకుండా చదువుతున్నాం, అర్థం తెలుసుకోకుండా చదువుతున్నాం. పారాయణ అంటాం. అర్థం తెలియదు మనకు. పారాయణ అంటే రీడింగ్ అని కాదు అర్థం. పరాయణత్వంతో చేసేటువంటిది 'పారాయణ'. ఇలా చాప్టర్లు, పేజీలు లెక్కపెట్టుకొని చదివినప్పుడు మనలో నిజంగా ఆ పరాయణత్వం కలుగుతోందా? కలగడం లేదు. అది నిజమైన పారాయణ ఎలా అవుతుంది? ఇవన్నీ ఆయన పెద్దగా పట్టించుకోరు కనుక, మనం ఎట్లా చదివినా సరే మనకిస్తున్నారు.

చిన్నపిల్లలు నువ్వు రైమ్ చెప్పు అనంటే, తప్పు చెప్పినా వెరీగుడ్.... భలే చెప్పావు అని చెప్పి మనం ప్రైజ్ ఇచ్చినట్లుగా... నిజానికి బాగా చెప్పలేదు. అయినా కూడా నువ్వెంత బాగా చెప్పావు అని అంటాం చూశారా, అలా బాబా మనల్ని ఎంకరేజ్ చేస్తున్నారు". మధురఫలాన్ని తోలు ఒలిచి నోటికందించినంత సులువుగా చెప్పారు కదా శ్రీబాబూజీ.

**పరిణామమే – పరమార్థం :** గురువు చూపిన బాటలో నడవాలంటే, చెప్పినట్లు చేయాలంటే కొంచెం శారీరక, మానసిక శ్రమ కలుగుతుంది. బాధ్యతలు నెరవేర్చవలసి ఉంటుంది. ఎలా అంటే సచ్చరిత్ర 'పారాయణ' చేస్తే, క్షమించాలి, పూజ్యగురుదేవులు చెప్పినట్లు 'చదివిచూస్తే'–





విశ్వరూప దర్శనం చేసి, విశిష్ట మార్గాన్ని చూపారు స్వామి.

మా గురుదేవులన్నట్లు ఎన్నో కారణాల వల్ల "ఆదిశంకరులలోనయినా దోషాలు చూపేవారున్నారు కానీ, శ్రీస్వామివారిని మాత్రం విమర్శించ సాహసించలేరు". స్పర్ధ ఉన్న సందర్భాలలో మనిషి ప్రవర్తన ఎలా ఉండాలో గమనించుకోవాలంటే మహాత్ముల మార్గమును అనుసరించవలసిందే. దేహభావాన్ని విడిచి సన్యసించిన పీఠాధిపతులకు కూడా తమ చేతితో విభూదినివ్వాలని ఆలోచించారు (అహం వహించారు) అర్చకులు. "దేహాభిమానమును ఎన్నడో విడిచిన అతి సామాన్యుడిని నేను" అని సాధారణ ప్రజల వలే విశ్వరూప సందర్శనానికై ఆలయ ద్వారమందు నిలబడి 'అహం' విడిచి నిలబడండని పరమాచార్యస్వామి మనకు ప్రబోధం చేస్తున్నారు. ఆదిశంకరులు చూపిన బాటన నడిచి – నిలిచిన గురుచంద్రులు కదా పరమాచార్యస్వామి – అహం ఆ పరమేశ్వరుని పాదాల చెంత – నడయాడిన దైవానికి చేతులు జోడించి నమస్కరించే జగమంతా. మా గురుదేవులు ఎప్పుడూ ఒక్కటే చెప్పేవారు "ఒక్కటే మహామంత్రంగా పెట్టుకోండయ్యా! అహము వదిలేయుటే సాయిపథం" అని.

మరో మమత–సమతల మధురానుభావాన్ని చూద్దాం. పూర్వాశ్రమంలో నాన్నగారైన సుబ్రహ్మణ్యంగారు పరాంగపట్టులో ఉపాధ్యాయులుగా ఉన్న సమయంలో ఒక అనుంగు శిష్యుడు బావమరక్కయార్ అనే ఒక చిన్నారి ముస్లిం బాలుడు. ఋణానుబంధ రూపంలో వారి గురువుగారన్నా, వారి కుటుంబమన్నా బహుప్రీతి ఆ చిన్నారికి. పెద్దవాడవుతున్నా ఎప్పుడూ ఒక బంధాన్ని కొనసాగించాడు ఆ కుటుంబంతో. క్రమంగా ఒక వ్యాపార సామ్రాజ్యాన్ని ఆర్జించాడు మరక్కయార్. ఎన్నో ఉప్పు మళ్ళు, వాణిజ్య ఓడలు, బోట్లు ఇలా! చిదంబర క్షేత్రానికి దగ్గరలో ఉన్న స్వామివారు పరాంగపట్టు వేంచేస్తున్నారని తెలిసి బళ్ళకొద్దీ పూలు, పండ్లు, తీసుకొని, స్వామికి ఎదురేగి తన వ్యాపార ప్రాంగణాన్ని తమ పదస్పర్శతో పునీతం చేయమని శిరస్సు వంచి అర్థించాడు అతను. మతమెక్కడిది ఆ మహితాత్ముని మానసాన? మానవత్వమే మతమై, జగత్హితమే అభిమతమైన ఆ పురుషోత్తమునికి! మౌనదీక్షలో ఉన్నప్పటికీ – మధుర పదార్థమందిన మంచి బాలుడు, మనిషి వెంట నడిచినట్లు – చిన్న పిల్లాడిలా మరక్కయార్ వ్యాపార ప్రాంగణమంతా కలియచుట్టి ప్రతీ విశేషాన్ని విన్నారు స్వామి. మండుటెండలో పదిమైళ్ళు నడవడంతో స్వామి కాళ్ళు బొబ్బలెక్కాయి. ఎంతో శ్రమ కలిగించినందుకు క్షమించమని వేడుకున్నాడు మరక్కయార్. 'ముస్లిం' భక్తుడిని శ్రీవారు



వద్దకు వారి వస్త్రాలు తీసుకుని రావల్సిందని – ఈ విషయం ఎవరికి చెప్పనవసరం లేదని ఆజ్ఞాపించారు. ఉదయం శివగంగ తీర్థంలో తమ స్నాన అనుష్ఠానాలను పూర్తి చేసుకుని నటరాజ స్వామి విశ్వరూప దర్శనానికై వారు కూడా సామాన్య భక్తుని వలే ఆలయ రాజగోపురం వద్ద వేచి నిలబడ్డారు. ఉదయం నటరాజస్వామి కైంకర్యం చేసుకునే దీక్షితులు స్వామివారిని ఆలయ ద్వారాన చూసి కంగుతిన్నారు. క్షణాల కాలంలో చిదంబర క్షేత్రంలోని పెద్దలందరికీ ఈ వార్త చేరడంతో వందలాదిగా ఆలయ ప్రాంగణం చేరారు భక్తులు. స్వామివారిని ఆలయ మర్యాదలతో లోనికి తీసుకువెళ్లామని ఆశించామని, వారికి ఇప్పుడు ఏమి చేయాలో తోచట్లేదని వేడుకున్న ఆ అర్చక స్వాములతో – తాము నటరాజ స్వామివారి విశ్వరూప దర్శనానికి వచ్చామని, చిదంబర విడిది సమయంలో చాలాసార్లు నటరాజ స్వామివారి దర్శనానికై వస్తామని చెప్పారు స్వామి. త్వరత్వరగా చేసిన ఏర్పాట్లు–ఆలయాధికారులు, అర్చకస్వాముల స్వాగత సుమాలతో, మర్యాదలతో ఎటువంటి ఆటంకం లేకుండా నటరాజుని దర్శించుకున్నారు పరమాచార్యస్వామి. అందరి విన్నపంతో స్వామి ఆలయ వేయికాళ్ళ మండపంలోనే విడిది చేసి పదిహేను రోజులు చంద్రమౌళీశ్వర సేవను గావించారు – చిదంబర భక్త జనులు ఆనంద సంద్రంలో తరించారు. యోగలింగ రూపంలో చంద్రమౌళీశ్వరుడు, మరోవంక ఆకాశలింగ స్వరూప ఈశ్వరుడు ఇలా రెంటినీ అనుభవించి తరించారు భక్తజనులు. విజ్ఞులకు విదితమైనా నా వంటివారికి తెలియదు కనుక ఈ ఆకాశలింగ విశేషం – చిత్‌సభలో ఆనందతాండవం చేస్తున్న జగదీశ్వరుని స్వస్వరూపమును నటరాజుగా చిదంబరఆలయంలో మనము దర్శించవచ్చు. అయితే ఈ రూపము వెనుక ఒక నల్లని తెరవంటి స్థితిని మాత్రమే భక్తులు చూడగలరు. ఆ ప్రాంతమున చర్మ చక్షువులకు కనపడని లింగము గలదని విశ్వాసము. ఇందువలననే వాడుకలో చిదంబర రహస్యము అన్న నానుడి కూడా గలదు. వేలాదిమందికి ప్రతీరోజు అభిషేకదర్శనము, సాయంవేళ స్వామి అనుగ్రహభాషణము లభించింది. ధన్యజీవులు కదా – చిదంబరవాసులు. నటరాజస్వామివారి గూర్చి పరమాచార్య స్వామివారు నుడివిన సత్సంగము కూడా బహు విశిష్టము. చిదంబర క్షేత్రంలో నెలరోజులు విడిది చేసాక చిదంబరేశ్వరునికి ఫాలభాగాన బంగారము, వజ్రములతో పొదిగిన నెలవంక చంద్రుని సభక్తికంగా సమర్పించి, జాతిని ధర్మమార్గాన నడపడానికి, తమ పాదాలతో భరతభూమిని పవిత్రం చేయడానికి పయనమయ్యారు స్వామి. రెండు వందల సంవత్సరాలు తమ పూర్వ ఆచార్యులు వెళ్ళని ఆలయంలో విడిది చేసి,





మనకు ఆకలి కాగానే సాటి వాడి ఆకలి గుర్తుకు వస్తుంది. మొదలు పెట్టిన పని చివరికంటా పూర్తి చేయాలని తెలియవస్తుంది. పరస్త్రీని చూసినపుడు కలిగే మోహంలో భగవంతుని సమున్నత సృష్టి చెంప పగలగొడుతుంది, అహంతో అవాకులు, చెవాకులు పేలే క్షణాన శ్రీసాయి మనలను దూరంగా ఉంచుతారన్న భయం కలుగుతుంది. భరించలేని కష్టం కలిగిన క్షణాన, చీకట్లు అలముకున్న సమయంలో కూడా మన గడప వద్దకే వచ్చే సాయి అభయమనే 'టాంగా' గుర్తుకు వస్తుంది. కడకు ప్రాణసమానులు ప్రాణం విడిచినా సరే – మన ప్రాణేశ్వరుడు సద్గురువేనని మనసు పదే పదే తలపోస్తుంది.


**అందుకే శ్రీసాయి సాధనాతపస్వి శ్రీబాబూజీ ఇలా అన్నారు – "బాబాచరిత్రలో వ్యక్తమయ్యే తత్త్వం ఏమిటి? ఏం చెప్పారాయన? ఒక లీల జరిగినపుడు ఆ భక్తుని స్థానంలో నేనుంటే ఎలా ఫీల్ అవుతాను? ఇలా ప్రతి విషయం గురించి తరచి చూసుకుంటూ, ఒక్క లీల చదివినా చాలు. నిజానికి ఆ ఇంట్రస్ట్ ఉంటే ఒక్క లీలతో ఆపము. నవల చదివినట్లుగా బాబా చరిత్ర చదువగలుగుతాము. చరిత్ర అవగాహనతో చదవడం వలన ఆనందం, తృప్తి కలుగుతాయి. లేకపోతే మామూలు జీవితం ఎంత అర్థరహితంగా ఉంటుందో, మనం శిరిడీ రావడం, సత్సంగాలు చేసుకోవడం ఇదంతా కూడా అంతే అర్థరహితమై పోతుంది. అర్థరహితమైన జీవితంలో 'పారాయణ' కూడా ఒక అర్థరహితమైన సాధన అవుతుంది. ఈ జీవితానికొక అర్థాన్ని చెప్పేటట్లుగా ఉండాలి మనం చేసేపని. ఈ అవగాహన పెంచుకొని ఆ నేపథ్యంలో జరిగేటటువంటి సాధన నిజమైన సాధన. అటువంటి సాధన చేసినపుడే మనం నిజమైన 'సాయిపథం'లో పయనించిన వాళ్ళమవుతాము" అన్నారు శ్రీబాబూజీ.**

సద్గురుపథం నడిచి చూపే పథమే గానీ, మనల్ని నడవమని ఆజ్ఞాపించే పథం కాదు. అవగాహనను కలిగించి, అహన్ని కరిగించి, అంతరాలను తొలగించి అంతరంగంలో కొలువున్న అంతర్యామిని చూపించి అడ్డుగోడులు కూల్చే పథమది – ఆనంద రథమది. గురువు బాటే, మనకు పెట్టని కోట కావాలి – కలకాలం ఆ దారిలో నడవాలి. **సద్గురు దివ్య పాదాలను హృదయంలో ప్రతిష్ఠించుకొని, భక్తిరాగరంజితమైన మనస్సునే కుంకుమతో ఆ పాదాలకు పారాణిగా చేసుకుందాం 'పారాయణ'ను.** ఆనాడు దుఃఖహేతువులైన వ్యక్తిత్వపు పరిమితులను తప్పక దాటుతాం – అన్ని పరిమితులకు పరమైన ఆనందం ఆ సద్గురువేనని తెలుసుకుంటాం, తప్పక ఆ చరణాలను చేరుకుంటాం. సద్గురు చరణం శరణం.

**– గురుకృప**



# 'అసహాయత - అనుగ్రహం' *నవంబర్ 2014*



**భక్తుడు** : గురువుగారూ! అప్పుడప్పుడూ మాకు అనుభవమయ్యే నిస్సహాయస్థితి నుండి బయటపడే మార్గం ఏమిటి?

**గురువుగారు :** సహాయం కోసం చూడటమే! (గురువుగారు నవ్వుతూ..)

**భక్తుడు** : మీ ఉద్దేశ్యంలో సహాయం కోసం చూడటం అంటే ఏమిటి?

**గురువుగారు :** మీకు మీ నిస్సహాయత నిజంగా అనుభవమైనపుడు మీరు ఆ నిస్సహాయస్థితి నుండి బయటపడటానికి ప్రయత్నిస్తారు. దాని నుండి బయటపడాలన్న ఆ కోరికే సహాయం కోసం అన్వేషించడమంటే. ఈ విషయం మీకు తెలియకపోయినప్పటికీ ఆ పాటికే మీరు సహాయం కోసం చూస్తుంటారు. అది అనివార్యంగా జరుగుతుంది, ఆ సహాయం అందినపుడు మీరు మీ నిస్సహాయతను అధిగమించారన్న అనుభవం కలుగుతుంది. మీరు ఆ సహాయాన్ని పొందినపుడు అది మీలోని నిరాశానిస్పృహలను తొలగిస్తుంది.

**భక్తుడు** : అంటే, ఆ నిస్సహాయత మమ్మల్ని బాబాకు దగ్గర చేస్తుందా?

**గురువుగారు :** ఆ నిస్సహాయత వల్ల మనకు బాబా అవసరం మరింత ఎక్కువవుతుంది. మనకేదైనా అవసరమైనపుడు ఆ అవసరమైన దానిని పొందడం మనకు ఇంకా ఎక్కువ ఆనందాన్ని ఇస్తుంది.

**భక్తుడు** : అప్పుడిక మనకు ఆ నిస్సహాయత అనుభవం కాదా?


**గురువుగారు :** అవును. అప్పుడిక మనకు ఆ నిస్సహాయత కలగదు. మనకు సహాయం నిండుగా ఉందనిపిస్తుంది. బాబా మనకు అండగా ఉన్నారనిపిస్తుంది. ఎందుకంటే బాబానే ఆ సహాయం కాబట్టి.

**భక్తుడు** : గురువుగారూ! సద్గురువును సహాయం కోరడానికి, అనుగ్రహం కోసం ప్రార్థించడానికి ఉత్తమమైన మార్గం ఏమిటి?

**గురువుగారు :** సహాయం పొందాలనే తీవ్రమైన కోరిక ఉండటం, ఆ సహాయం మీకు ఎంతో అవసరం అవడం ఉత్తమమైన మార్గం. ఉదాహరణకు, మీరు ఓ ప్రవాహంలో పడి కొట్టుకు పోతున్నారనుకోండి. మీరు ఏం చేస్తారు? మీకు ఏది దొరికితే దానిని పట్టుకుంటారు. అక్కడ పట్టుకుందామా వద్దా అనే డైలమా (మీమాంస) ఉండదు. "ఈ చిన్న కర్ర నన్ను ఒడ్డుకు చేర్చగలదా, దానికి అంత బలం ఉందా?" ఇలాంటివేవీ ఆలోచించం. ఏది దొరికితే దానిని పట్టుకుంటాం!







లోకహితము చేయుటకు మీకు సంపూర్ణ జ్ఞానము ఉండవలెను కదా! పరిపూర్ణ జ్ఞానమార్జించుటకు మీరు చేయు కృషియే మీరు జగత్తుకు చేయగల గొప్ప మేలుగా గుర్తుంచుకోండి. సుమారు తొమ్మిది దశాబ్దాల క్రితం చేసిన సత్సంగ భాషణమిది. ఈనాటి ఎన్నో విద్యావిధానపు వైకల్యాలకు చెంపపెట్టు, ప్రగతిమెట్లు రెండూ ఉన్నాయి స్వామివారి సందేశంలో. శ్రీవారి విషయ పరిజ్ఞానము, శ్రేయోమార్గాన్ని బిడ్డలకు చూపాలన్న శ్రీవారి తపన ఎన్ని తరాలు మారినా ప్రతీ విద్యార్థికీ, ఉపాధ్యాయులకు తప్తమార్గమే! సందేహం లేదు. మారుతున్న వ్యవస్థలో తల్లిదండ్రులు కూడా స్వామివారు చూపిన ఈ శుభ్రమార్గంలో తమ బిడ్డలు పయనించేందుకు కృషి చేయవలసిన అవసరం ఎంతో ఉందని తెలియచెపుతోంది ఈ సత్సంగభాషణం.

చెన్నై మహానగరం విడిచి తిరువట్రియూర్, కుంభకోణం, తంజావూరు మీదుగా సాగిన స్వామివారి యాత్ర పంచభూత క్షేత్రాలలో ఒకటైన ఆకాశలింగ క్షేత్రము చిదంబరమునకు చేరింది. చిదంబర పురజనులు, మహోపాధ్యాయ దండపాణిస్వామి దీక్షితులు మున్నగు బుధజనుల వినతి మేరకు ఆ సంవత్సరము శంకరజయంతి తర్వాత పరమాచార్య స్వామివారు చిదంబరానికి వేంచేసారు. కంచి ఆచార్యులు వేంచేస్తున్న ఆ శుభతరుణాన్ని పురజనులందరూ ఊరు బయట వేచి స్వాగత సత్కారాలతో స్వామివారిని గౌరవించుకున్నారు. ఊరేగింపుగా రథం సాగే నాలుగు మాడవీధులలోనూ స్వామివారు భక్తులకు దర్శనమిచ్చిన ఆ క్షణాలు నేత్రపర్వంగా సాగాయి. వేదఘోష, నాదస్వర మేళతాళాలు, భజనబృందాలతో సాగిన ఆ శోభాయాత్రలో వేలాదిమంది స్వామి ఆశీస్సులనందుకున్నారు. పంచభూత క్షేత్రాలలో మిగిలిన నాలుగు క్షేత్రాలను స్వామివారు ఇప్పటికే దర్శించుకొని ఉన్నారు. ఆకాశక్షేత్రమైన చిదంబరంలోని నటరాజస్వామివారిని దర్శించుకోవడంలో మాత్రము ఒక చిక్కు ఉంది. మామూలుగా పీఠాధీశులు ఎవరైనా ఇతర ఆలయాలకు వెళ్ళినపుడు అక్కడ అర్చకులు ఇచ్చిన పాత్ర నుండి విభూతిని కానీ, కుంకుమను కానీ వారి స్వహస్తాలతో తీసుకోవడం పరిపాటి. అయితే, చిదంబరంలోని అర్చకులు ఈ సాంప్రదాయాన్ని ఒప్పుకునేవారు కారని, ఎవరైనా వారి చేతులమీదుగా ఇచ్చిన విభూది, కుంకుమలను స్వీకరించవలసిందేనని చారిత్రక ఆధారాల వల్ల తెలియవస్తోంది. ఇందులో సత్యము సంగతి ఎలా ఉన్నా గత 200 సం॥ల కాలంలో శంకరాచార్యులెవ్వరూ నటరాజ దర్శనము చేసుకోలేదన్నది తెలియవస్తోంది. స్వామివారు చిదంబరం చేరిన రోజు రాత్రి వారి వస్త్ర కైంకర్యము చేసే యువ సహాయకునితో – ఉదయం ఐదు గంటలకల్లా నటరాజస్వామి ఆలయ శివగంగ తీర్థం



వారు ప్రార్థిస్తారు. అది భగవంతుడు కూడా కాదు – అన్నింటికీ అతీతమైన ఆదర్శం. అలా చేయడాన్ని నేను ఇష్టపడతాను. మనుషులు వారి వారి విశ్వాసాల గురించిన ప్రస్తావనలోకి లోతుగా వెళ్ళకుండా – ఎందుకోగాని మహాత్ములు విద్యకు, వైద్యానికి ఎంతో ప్రాధాన్యమిచ్చేవారు – మానసిక చీకటిని తొలగించేది విద్య – శారీరక రుగ్మతను పోగొట్టేది వైద్యం. మరో మాటలో చెప్పాలంటే మానసిక ప్రజ్ఞ – మనో ప్రజ్ఞలను ప్రసాదించేవి వైద్యము, విద్య అని చెప్పవచ్చు. సనాతనమైన 'వేదవిద్య' నుండి సనూతన విద్యాలయాలను తీర్చిదిద్దుతోంది కంచిపీఠ వ్యవస్థ. అంతేకాదు, ఎన్నో వైద్యాలయాలను నెలకొల్పి, 'మాధవసేవను – మానవసేవ'గా చేస్తోంది. మా గురుదేవులు పూజ్యశ్రీబాబూజీ శ్రీసాయినాథుని ఆదర్శాలకనుగుణంగా సాయిబాబా సెంట్రల్ స్కూల్ ద్వారా జ్ఞానదీపాన్ని వెలిగిస్తుంటే – ఎందరో హోమియో వైద్యులు గురుదేవుల బాటన నడిచి, శారీరక రుగ్మతలను బాపుతున్నారు వారి అనుగ్రహంతో.

పరమాచార్యస్వామివారు చెన్నైలో విడిది చేసిన సమయంలో విద్యార్థులను కూడా వారి అనుగ్రహభాషణంతో ఆశీర్వదించారు. హిందూ థియోలాజికల్ హైస్కూల్ విద్యార్థులను ఉద్దేశించి చేసిన అక్షరాశీర్వచనమది. "కాళిదాసు తన రఘువంశంలో ప్రథమ పద్యంలో చెప్పినట్లు మనందరకు పార్వతీపరమేశ్వరులు మాతాపితరులు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కుటుంబ సభ్యులవలే మెలగవలెను. మీరు మీ చిన్నతనంలో అవకాశం ఉన్న ప్రతీక్షణాన్ని సద్వినియోగం చేసుకొని విద్యను ఆర్జించండి. విద్యా సముపార్జనలో రెండు ప్రధానాంశాలు ఉన్నాయి. మొదటిది గురుభక్తి, రెండవది విలువలతో కూడిన క్రమశిక్షణ. కోపాన్ని, ఇతరులను నిందించడాన్ని, విమర్శించడాన్ని పూర్తిగా వదిలిపెట్టండి. వైద్యుడిచ్చిన ఔషధాన్ని స్వీకరించేటపుడు ఎలా అయితే పథ్యాన్ని పాటిస్తామో అలానే గురువు చెప్పిన మాటలను, పెద్దలు చూపే శుభ్రమైన బాటను వదిలి స్వతంత్రులుగా ఉండాలన్న తలంపు మీకు శ్రేయస్సును చేకూర్చదు. గురుభక్తి, వినయము, ధర్మబద్ధమైన జీవితము విద్యార్థులకు ఆవశ్యకములు. వినయశీలురైన విద్యార్థులు ఉన్నత శిఖరములు చేరగలరు. అవ్వయ్యార్ చెప్పినట్లు తల్లిదండ్రులు మీకు ప్రథములు కావలెను. మాతాపితా గురుభక్తి మిమ్ము అనుక్షణము కాపాడగలదు. మీకు చేటు చేయు అహమును విడిచిపెట్టినచో మీరు కృతార్థులు కాలగరు. వేదములు కూడా ఈ విషయమును తెలియచెప్పి ఉన్నవి. విద్యార్థి దశలో లోకకార్యముల గూర్చి మీరు చింతించకండి. మీరు నన్నడగవచ్చు. "లోకహిత కార్యములలో పాల్గొనకపోవడం తప్పు కదా అని? నిజమే! అయితే





కాకడ ఆరతిలోని చివరి గీతాన్ని చదవండి. సహాయం ఎలా కోరాలో మీకు తెలుస్తుంది. "మీ బుడతో భవభయడోహీ ఉద్ధరా!" (సద్గురూ, మమ్మల్ని రక్షించడానికి ఉన్న పళంగా తరలిరండి) అని ఉంటుంది. అదృష్టవశాత్తూ మనకు బాబా అనే అత్యుత్తమమైన రక్షణ ఉంది. కానీ అసలు విషయం ఏమిటంటే మనకు అంత రక్షణ అవసరం లేదని భావిస్తుంటాం. కాబట్టి మనం ఎప్పుడూ బాబాను కాస్త ఆగమని చెబుతూ ఉంటాం. "బాబా, మీరు సహాయం చెయ్యగలరు, మంచిది. కానీ మీరు కాసేపు ఆగండి. నాకు సహాయం అవసరమైనపుడు నేను పిలుస్తాను. మీరిచ్చిన ఆఫర్‌కు ధన్యవాదాలు" అంటాం (గురువుగారు నవ్వుతూ...)

మీకు జీవితంలో ఎన్నో అవసరమై ఉంటాయి. మీరు సహాయం అడిగి ఉంటారు. ఎలా అడగాలో ఎవ్వరూ నేర్పలేదు. పసిబిడ్డలా ఉన్నప్పుడు మీ అమ్మ సహాయం తీసుకొని ఉంటారు. అమ్మని సాయం అడగాలని నీకు ఎవరు నేర్పించారు? మీరు ఎంతో దూరం ప్రయాణం చేసి మీ మీ దేశాల నుండి ఇక్కడకు వచ్చారు. మీరు ఎన్నో విషయాలలో ఎంతోమంది సహాయం తీసుకొని ఉంటారు. అవన్నీ మీకు ఎవరు నేర్పారు? ముందు మీకొక అవసరం అనేది ఉండాలి. ఆ అవసరమే మీకు ఎలా అడగాలో నేర్పుతుంది. ఆ అవసరమే దానిని తీర్చుకునే పద్ధతిని, ఆ ప్రక్రియను (టెక్నిక్‌ను) నేర్పుతుంది. ఇది ప్రత్యేకమైనది, ఇది అద్వితీయమైనది. ఇది ఉన్నతమైనదని చెప్పబడే పద్ధతుల కోసం ప్రాకులాడకండి. పద్ధతుల్లో (టెక్నిక్స్‌లో) ఏమీ లేదు. మనకు అవసరం ఉంటే మనకు తగిన పద్ధతిని మనమే కనుక్కుంటాం. క్రొత్త ఆవిష్కరణలకు అవసరం తల్లి వంటిది. మన కోసం, మన మంచి కోసం మనం కనుక్కునే పద్ధతే ఉత్తమమైన పద్ధతి.

మీరు ఎప్పుడూ సహాయం కోసం వెతుకులాడమని నేను చెప్పడం లేదు. ముందు మీకు మీరుగా మీ లక్ష్యాన్ని సాధించడానికి ప్రయత్నించండి. అది అన్నింటికంటే మంచి పద్ధతి. మీ చేతకానప్పుడు, అంతకుమించి వేరే ఛాయిస్ మీకు లేదు – మీరు సహాయం కోసం అన్వేషించాలి. కాబట్టి గురువు అవసరమా? సాయం అవసరమా, లేదా? అన్న ప్రశ్నే ఉత్పన్నం కాదు. మీకు నిజంగా సాయం అవసరం అయితే గురువును అన్వేషించి ఆయనను ఆశ్రయించండి. అది మీ ఎంపిక (ఛాయిస్) కాదు. అంతకుమించి మీకు వేరే దారి లేదు. 'నాకు వేరే దారి లేదు' అనే స్థితి వచ్చేవరకు మీకు ఏదో (మీకై మీరే సాధించగలరు అనే) ఆశ ఉంటుంది. నాకు ఇంకా కొన్ని అవకాశాలున్నాయి. నేనెందుకు ప్రయత్నించకూడదు అనిపిస్తుంది. అలాంటప్పుడు ప్రయత్నించి చూడండి. ముందు మీకున్న వనరులన్నింటినీ వాడుకుని ప్రయత్నించండి. మీరు విజయం సాధిస్తే మంచిది. అప్పుడది మీకై మీరు సంపాదించుకున్నదవుతుంది. మీరు చెయ్యలేకపోతే వేరొకరి సహాయం అర్థించక మీరు చెయ్యగలిగినది



మాత్రం ఏముంది!

**భక్తుడు :** గురువుగారూ, సరైన మార్గాన్ని ఎన్నుకునే విషయంలో తప్పు చేస్తానేమోనని, సరైన మార్గాన్ని ఎంపిక చేసుకోలేనేమోనని భయంగా ఉంటుంది. ఈ విషయంలో నేనేం చెయ్యాలి?

**గురువుగారు :** మీకు ఏం కావాలో ఆ లక్ష్యాన్ని, ఆ విషయాన్నే మీరు ఎంపిక చేసుకుంటారు. దానిని పొందే విషయంలో మీకు ఏవైనా భయాలు ఉంటే, దానిని సాధించడానికి మార్గం తెలియకపోతే బాబా వంటి సద్గురువుల పాత్ర అవసరం అవుతుంది. మీకు దానిని ఎలా పొందాలో తెలిస్తే మీకై మీరే ప్రయత్నం చేసి ఆ లక్ష్యాన్ని సాధించండి. కానీ ఒకవేళ మీకు కావలసిన వనరులు లేకపోతే, మీరు చేస్తున్నది సరైనదో కాదో తెలియక మీకు భయంగా ఉండి మీరు ఎంతో నిస్సహాయంగా మారినపుడు బాబా నుండి సహాయాన్ని అర్థించండి. ఆ సహాయం దేనికి? మీకు కావలసిన, అవసరమైన మీ వ్యక్తిగత గమ్యాన్ని చేరుకోవడం కోసమే.

**భక్తుడు :** గురువుగారూ, ఎంపిక చేసుకోవడానికి అంత ప్రాధాన్యతనిచ్చే ఆ ఎమోషన్ (భావోద్వేగం) ఏమిటి?

**గురువుగారు :** ప్రతిసారీ తప్పనిసరి పరిస్థితులలో నిస్సహాయంగా ఏదో ఒక దానిని ఎంపిక చేసుకోవాల్సిన పరిస్థితి నుండి బయటపడాలన్న మౌలికమైన ఎమోషన్ (భావోద్వేగం) అది. సరిగ్గా ఎంపిక చేసుకోలేని మన దౌర్బల్యం నుండి బయటపడటం కోసం మనలో కలిగే తపనది.

**భక్తుడు :** అలా అయితే నిస్సహాయస్థితి నుండి బయటపడాలన్న కోరిక నిజానికి చాలా బలమైన భావోద్వేగమన్నమాట.

**గురువుగారు :** నిజమే, అది చాలా బలమైన భావోద్వేగం (ఎమోషన్). నీ ఉనికికి మూలం అదే. అసలు మన పుట్టుకే మన ఎంపిక కాదు. అది మన చేతుల్లో లేదు. మీరు ఎవరినైనా "మీరు ఎందుకు జీవిస్తున్నారు" అని అడిగి చూడండి. వారివ్వగలిగిన ఒకే ఒక సమాధానం, "ఇంకా మేము చనిపోలేదు కాబట్టి" అని! మన అస్తిత్వం అంత నిస్సహాయంగా ఉంది. మనం కేవలం నిస్సహాయంగా బ్రతుకుతున్నాం. ఎంత దౌర్భాగ్యమైన స్థితి అది. మనం ఆ నిస్సహాయమైన స్థితిని అధిగమించడానికి, ఆ విచారకరమైన స్థితి నుండి మనల్ని మనం విడుదల చేసుకోవడానికి మనం చేసే ప్రయత్నం మొదలైనవన్నీ వస్తాయి. **మనకు ప్రకృతి ప్రసాదించిన జీవితమనే పుస్తకంలో ఒక్క పదాన్ని కూడా సరిగా అర్థంచేసుకోకుండా మనం పేజీలు త్రిప్పేస్తున్నాం. అది ఎవరు వ్రాసారో, ఎందుకు వ్రాసారో, అందులో ఎన్ని పేజీలున్నాయో కూడా మనకు తెలియదు.**





అక్షరం.

పూజ్య పరమాచార్య స్వామివారు బహుముఖ ప్రజ్ఞాశాలి అని మనం ఇంతవరకు అవలోకించిన అంశాల ద్వారా తెలుసుకొని ఉన్నాము. స్వామి చెన్నై నుండి బయలుదేరే ముందు ఒక ఉపాధ్యాయ బృందమునకు తమ ఆశీస్సులను సత్సంగ రూపంగా అందించారు. అవధరిద్దాం...

"తమ జీవితమే (నేర్చుకున్నది) జీవనోపాధిగా గల్గిన అదృష్టవంతులు ఉపాధ్యాయులు. ఇతరులు జీవనోపాధికై ఎన్నో వృత్తులు చేస్తున్నప్పటికీ అవి వారి విద్యకు సంబంధించినవి కాకపోవచ్చు. ఉపాధ్యాయులు తమ బోధనాంశాలను విద్యార్థులకు చెప్పే ముందుగానే తాము సంపూర్ణ అధ్యయనం చేసి, విద్యార్థుల మనోఫలకాలలో స్థిరంగా నిలిచే విధంగా, ఆ నేర్చుకున్న దానిని అన్వయించుకొని, ఉపయోగించుకునే విధంగా చేయడం ఆవశ్యకం. ఒక చిన్న కథ చెపుతాను – "ఒకానొక రాజ్యంలో ఒక విద్వాంసుడు ఆ దేశ రాజుకు భాగవతం చెప్పడానికి రాజుగారి కోటను చేరతాడు. ఆ రాజు ఆ విద్వాంసుని భాగవతం బాగా నేర్చుకు రమ్మని త్రిప్పి పంపుతాడు. ఇలా ఆ విద్వాంసుడు రాజమందిరం చేరడం – రాజు మరలా నేర్చుకు రమ్మని విద్వాంసుడిని త్రిప్పి పంపడం ఇరవై ఒక్కసార్లు జరిగింది. ఆ సమయానికి ఆ విద్వాంసునికి భాగవతం వంటబట్టి భగవతత్త్వాన్ని తెలుసుకోవాలన్న తలపుతో ఏకాంతానికై అరణ్యాన్ని చేరుతాడు. భగవంతుని తలపు గలిగిన భాగవతుని చెంతకు చేరి ప్రణమిల్లాడు రాజు". ఇలా ఏ శాస్త్రంలోని ఆంతర్యమైన స్వాధ్యాయము లేక సత్యము తెలియదు. మీ అధ్యయనమే మిమ్ములను సరైన అధ్యాపకునిగా చేయగలదు. పూర్వజులైన మన మహాత్ముల అధ్యయన బాటన మీరు నడిచి, మీ శిష్యులను సత్యపథమున నడపమని, భగవంతుని ప్రార్థిస్తూ ఆశీస్సులు అందిస్తున్నాను".

పూజ్య గురుదేవులు శ్రీబాబూజీ విద్యకు ఎంతో ప్రాధాన్యమిచ్చేవారు. వారు గృహస్థుగా వారి జీవనోపాధికోసం 1983వ సంవత్సరంలో ఒంగోలు పట్టణంలో సాయిబాబా సెంట్రల్ స్కూలును స్థాపించారు. ఆదర్శాల పునాదుల మీద, విలువల ఇటుకలతో నిర్మితమై, ప్రేమాన్వేషణలే బంధంగా నిర్మాణం జరిగిన విద్యాలయమది. వారు చిన్నారులకై, రచించిన ప్రార్థన ఎలా ఉండేదో వారి మాటల్లోనే "నేను స్కూలు కోసం వ్రాసిన ప్రార్థనలో కనీసం బాబా పేరు కూడా లేదు. ఆ ప్రార్థనలో అన్వేషణా స్ఫూర్తిని, ప్రేమను మేల్కొలిపే ఒక విశ్వవ్యాపకమైన నియమాన్ని, మానవాతీతమైన ఆదర్శాన్ని



# గురుకృపాలహరి


**భాగవతము దెలిసి పలుకుట చిత్రంబు ! శూలికైన దమ్మి చూలికైన,**

**విబుధ జనుల వలన విన్నంత కన్నంత ! దెలియవచ్చినంత తేట పరుతు !!**

ఆంతర్యం తెలుసుకొని, అన్ని కోణాలు అర్థం చేసుకొని, భాగవతాన్ని విశదపరచడం బ్రహ్మకు, ఆ మహాశివునికే సాధ్యం కానిది. అందుకే జ్ఞాన ధనులు, విబుధ జనులు చెప్పగా విన్నది, నాకు అవగతమయినది మీతో పంచుకుంటాను అని ఎంతో వినయంగా విన్నవించారు సద్గురు అనుగ్రహ ఘన పోతన. భగవంతుని విశేషణాల గురించి చెప్పడం సులభమైన పనేగాని, భాగవతుని ప్రేమను వర్ణించాలంటే కలాల హలాలు సరిపోతాయా? భాగవతునిది నిత్య తపస్సు – తనువు, మనసులు హవిస్సులు కాగా, సృష్టి – స్థితులనే జీవన యజ్ఞంలో మనందరితో నడుస్తూ, తన జీవితాన్నే, సమిధలుగా చేసి, యశోధనుడైన భగవంతుని తేజస్సును మనందరిపై ప్రసరింపచేసే భగవంతుడు – భాగవతుడు. నిజానికి భాగవతుడే భగవంతుడు. అందుకే అన్నారు శ్రీసాయి 'అడ్డుగోడ'ను కూల్చు అని. 'ఎల్లలు లేనిది సద్గురు అనుగ్రహం' అనడానికి సాక్ష్యమా అన్నట్లు ఈ యుగంలోనూ అట్టి భాగవతులు అవనికి వేంచేసారు సద్గురు స్వరూపంతో. ఈ కార్యానికి వారే నిజమైన మార్గదర్శులు, వారి చరితలే మనకు దీపస్తంభాలు.

శ్రీదలైలామా అన్నారు "ఈ శతాబ్దపు నిజమైన సన్యాసి" అని శ్రీచంద్రశేఖర పరమాచార్య స్వామివారి గురించి ప్రస్తుతిస్తూ! నిజానికి ఎవరి ధర్మాన్ని వారు సమున్నతంగా పాటిస్తే, సత్యమార్గంలో పయనిస్తే, సంపూర్ణంగా జీవిస్తే ఈ జగమంతా నిత్య కళ్యాణంగా శోభిస్తుంది కదా! పరమాచార్యస్వామివారి జీవితమే ఇందుకు సాక్ష్యం. ధర్మానికి ఆకారం వారి రూపం – వారి జీవితమే ధర్మస్వరూపం. స్వామివారి జీవిత చిత్రణ మనందరిలోనూ ఒక విశేషమైన సంకల్పాన్ని, విశిష్టమైన మానవతా విలువలను, విశ్వాసంతో కూడుకున్న సద్భక్తిని కలిగించగలదన్న గురుదేవులు శ్రీబాబూజీ ప్రేరణే 'గురుకృపాలహరి'. మా గురుదేవులు మాకు నేర్పింది – అనుభవాల నుండి ఆంతర్యంవైపుగా, ఘటనల నుండి ఆ ఘటనల వెనుక దాగిన సమర్థుని వైపుగా, అంతరంగంలో సాగే ఆలోచనల నుండి అంతరాత్మవైపుగా, ఒక్క మాటలో చెప్పాలంటే 'మనిషి' 'దైవం'గా ఎదిగే 'పరిణామం' వైపుగా సాగే ఈ సమున్నత పయనానికి వెన్నుదన్నులు ఈ మహితాత్ముల చరితలు. మా గురుదేవుల ప్రేమమానసం నుండి ప్రభవించిన ప్రేమ కమలమే ఈ చరితం – వారి అనుగ్రహ మధువే ప్రతీ





**భక్తుడు :** వీటన్నింటినీ ఒక చోటుకు తీసుకురావడానికి మనకు మరో బలమైన భావోద్వేగం యొక్క అవసరం ఉందని మీరు చెప్పారు. ఆ భావోద్వేగం కూడా మన ఎంపిక కాదు, మేము త్రిప్పుతున్న పేజీలలో అది ఎక్కడో వస్తుంది.

**గురువుగారు :** అవును అది కూడా మీ చేతులలో లేదు. కానీ అది మిమ్మల్ని మీ నిస్సహాయస్థితి నుండి బయటపడేలా చేస్తుంది. ఒక్క పదం కూడా అర్థం చేసుకోకుండా పేజీలు త్రిప్పుతున్నప్పుడు నిజానికి మీకు సాయపడేది ఏమిటి? మీకు ఆ పుస్తకంలో – ఆ భాష, అక్షరాలు, వ్రాసే పద్ధతి, వ్యాకరణం – మొదలైన వాటిని నేర్పించడానికి మీకు ఎవరో ఒకరు కావాలి. అప్పుడు మీరు జీవితమనే పుస్తకాన్ని ఆస్వాదించగలుగుతారు.

**భక్తుడు :** గురువుగారూ! నేను నిస్సహాయుణ్ణి అని నేను అనుకోవడం లేదు. అందుకే నేను నిజంగా సహాయం కావాలనుకోవడం లేదు. ఇలాంటప్పుడు నేనేం చెయ్యాలి?

**గురువుగారు :** మీకు మీ నిస్సహాయత పూర్తిగా అనుభవంలోకి రావాలి. ఒక్కొక్కరికి ఒక్కొక్క రకంగా ఈ నిస్సహాయత అనుభవమవుతుంది. సహాయం కూడా అలానే రకరకాల మార్గాలలో అందుతుంది. సహాయం కోసం ప్రయత్నించే పద్ధతి. వారికి సాయం అందే పద్ధతి మనిషికి మనిషికి మారుతూ ఉంటుంది. బుద్ధుడు ఎంతగానో ప్రయత్నించాడు. ఒక స్థాయిలో ఆయనకు తన నిస్సహాయత అనుభవంలోనికి వచ్చి అన్ని సాధనలు, అన్ని ప్రయత్నాలకు స్వస్తిచెప్పి బోధి వృక్షం క్రింద కూర్చుండిపోయాడు. ఆయన అప్పటివరకు చేస్తూ ఉన్న అన్నింటినీ వదిలిపెట్టేశాడు, అప్పుడు ఆ స్థితిలో – ఆ నిర్వాణం, పరిపూర్ణత్వం, సమాధానం, మీరు దానిని ఎలా పిలిచినా సరే – ఆయనకు అది తక్షణం సిద్ధించింది. బుద్ధుడు సైతం ఆ నిస్సహాయస్థితిని, అన్నింటిని వదిలిపెట్టాల్సిన స్థితిని అనుభవించాల్సి వచ్చింది. కానీ మన విషయం వేరు. మన సాధన, ప్రయత్నం, అవసరం అంత తీవ్రంగా ఉండదు, కాబట్టి సహాయం కోసం మన అవసరం కూడా అంత తీవ్రంగా ఉండదు. మనం ఎంత నిస్సహాయులమో చూపడానికి కూడా మనకు ఇంకొకరు కావాలి. అదీ మన పరిస్థితి (నవ్వులు..) లేదూ, మనం బుద్ధులలాగా అయ్యి అన్నీ వదలిపెట్టేయగలిగితే మంచిది. బుద్ధుడు ఆ నిర్వాణస్థితిని పొందిన తరువాత ఆయన తన మార్గం గురించి చెబుతూ, 'బుద్ధం శరణం గచ్ఛామి' అన్నారు. అంటే బుద్ధునికి శరణు పొందుతున్నాను అని అర్థం. బుద్ధుడు దేనికి (ఎవరికి) శరణు పొందాడో మనకు తెలియదు. ఆయన తనకే శరణుపొందాడో, తన నిస్సహాయస్థితికి శరణు పొందాడో లేక మరో దానికో – అదేమిటో చరిత్రలో ఎక్కడా వ్రాసిలేదు. అది ఈ విధంగానే ఉండాల్సిన అవసరం లేదు. అది చాలా రకాలుగా జరుగవచ్చు. మన నిస్సహాయతను తెలుసుకొని వ్యక్తం చేస్తూ, ఒక బుద్ధునికి (బుద్ధత్వం



పొందిన వ్యక్తికి), సద్గురువు పాదాలకు శరణు పొందాలని బుద్ధుని ఉద్దేశ్యం. ఎవరైతే తమ నిస్సహాయతను అనుభవిస్తారో వారే శరణాగతి పొందుతారు.

బాబా జీవితంలో కూడా ఆయన తమ నిస్సహాయతను ఎలా అనుభవించారో అనే విషయాన్ని చూడవచ్చు. కానీ ఆయన దానిని వేరే రకంగా వ్యక్తం చేసారు. **"నేను అల్లా బానిసను"** అని చెప్పేవారు బాబా. ఆయన అల్లా మీద ఎలా పూర్తిగా ఆధారపడి ఉన్నారో చూడండి. రమణమహర్షి మరో రకంగా వ్యక్తం చేసారు. ఆయనకు తమ నిస్సహాయత మరణానుభవమనే అత్యంత నిస్సహాయస్థితిలాగా అనుభవమైంది. అక్కడ ఆ స్థితిలో ఎవరైనా జీవితాన్ని నిలుపుకోవాలనుకుంటారు. కానీ దానిని నిలుపుకోవడంలో వాళ్ళు అశక్తులు. ప్రాణం పోతుంది – ఇదే మరణం అంటే. రమణులు తమ నిస్సహాయతను మరణంలాగా భావించారు. వాళ్ళందరూ తమ నిస్సహాయస్థితిని రకరకాలుగా వ్యక్తం చేసి రకరకాల మార్గాలలో సాయం అర్థించారు. వారికి సహాయం అందింది కూడా వివిధ రకాలుగానే. అది చాలా వ్యక్తిగతమైనది. కాబట్టి, మీ నిస్సహాయతను అనుభవించండి. సహాయాన్ని కోరండి, మీదైన మార్గంలో సహాయాన్ని పొందండి.

**భక్తుడు :** మనకు సాయం చెయ్యడానికి వేరెవరన్నా ఉన్నప్పుడు మన నిస్సహాయతను మనం ఆనందంగా ఆస్వాదించగలమా?

**గురువుగారు :** ఈ నిస్సహాయత నిజంగా నిస్సహాయత కాదు. అది మరో రకంగా అనుభవమవుతుంది. పెద్దవాళ్లం కాబట్టి మనకు ఈ విషయం అర్థం కావడం కష్టం. ఒక నెల పసిబిడ్డ విషయమే తీసుకోండి. ఆ బిడ్డ నిజంగా నిస్సహాయంగా ఉంటుంది. తాను నడవలేదు, తనను తాను రక్షించుకోలేదు, ఆహారం తీసుకోలేదు, తనకు తానుగా ఏమీ చేసుకోలేదు. తన మనుగడ యావత్తూ తల్లిమీద, లేదా సంరక్షకుని మీద ఆధారపడి ఉంటుంది. కానీ ఆ బిడ్డ ఎంత ఆనందంగా ఆడుకుంటుందో చూడండి. "నీ నిస్సహాయతకు నువ్వు సిగ్గుపడాలి, నీ ఆహారం నువ్వు తయారుచేసుకోలేవు. నువ్వు ప్రతి విషయానికి ఎవరిమీదైనా ఆధారపడాలి, అయినా నువ్వు ఎలా సంతోషంగా ఉంటావు" అని అంటుందా తల్లి? (గురువుగారు నవ్వుతూ...) **తన తల్లి సంరక్షణ, ప్రేమ ఉన్నంతవరకు ఈ నిస్సహాయత నిస్సహాయతగా ఆ బిడ్డకు అనుభవం కాదు.** మనం పెద్దవాళ్ళమైనప్పటికీ ఈ నిస్సహాయత విషయంలో మనం పిల్లలమే. మనకు అలాంటి రక్షణను, భద్రతాభావాన్ని ఇచ్చే తల్లి కావాలి. మనకు ఆ రక్షణ ఉన్నప్పుడు మన నిస్సహాయత విషయంలో మనం బాధపడటం మానేస్తాము. నిజానికి మనం సంరక్షణలో ఉన్నట్లు భావిస్తాము. ఆ నిస్సహాయతను నువ్వు ఆనందిస్తావని కాదు, అది మరో రకంగా అనుభవమవుతుంది. మనకు ఆనందాన్నిచ్చేది ఆ సంరక్షణ. సరిగ్గా అదే బాబా చేస్తారు, అందుకే మనకు సద్గురువు అవసరం.





కానీ ష్యామా ఊహించినదానికంటే భిన్నంగా జరిగింది. రెండు రూపాయల సంగతి ష్యామా మరిచాడు. బాబా ఎన్నడూ ఆ ప్రస్తావన చేయలేదు. ఈ విధంగా చాలాకాలం గడిచిన తరువాత.

(రు) ష్యామా ఇంటిలో దొంగలు పడి 250 రూపాయల విలువగల సామగ్రిని దొంగిలించారు. ష్యామా దుఃఖభారంతో బాబాకు నివేదించగా, బాబా–ష్యామాతో "నాకు చాలా కాలం క్రితం రెండు రూపాయలు వచ్చాయి. వాటి వైనమే తెలియదు. కుటుంబం కలిగిన నీకు 250 రూపాయలు ఎంత విలువో నాకు నా రెండు రూపాయలు అంత విలువ కలిగిందే కదా". బాబాకు రెండు రూపాయలు ఇవ్వని కారణంగా దొంగలు పడ్డారని బాబా భక్తులు అనుకొనరాదు. కాకతాళీయంగా జరిగిన సంఘటనగా భావించాలి. బాబా సర్వజ్ఞుడను విషయం వరకే మన ఆలోచన సాగాలి.

**ఉపాసనీ బాబా విషయంలో :** నేను మీ ఇంటికి వస్తే నాకు భోజనం పెట్టి చిలిం అందివ్వగలవా? అని అడిగారు బాబా. తమరొస్తే నేను "గుర్తించలేక" పోవడమేమిటి? అలాగేనన్నారు ఉపాసనీ బాబా.

(గు) చాలాకాలం గడచిన తరవాత బాబా నివేదనకై ఉపాసనీ బాబా ఖండోబా ఆలయంలో వంటను వండుచున్న సమయంలో ఒక నల్లని రంగు కల కుక్క అక్కడికి ఆర్తిగా వచ్చింది. దానిని తరిమి కొట్టేంత వరకు ఉపాసనీ ఊరుకోలేదు.

(రు) నేను నీ దగ్గరకు వస్తే తరిమి తరిమి కొట్టావని బాబా అనగానే బాబా తమరు ఎప్పుడు వచ్చారు. అనగానే ఆ నల్లని కుక్క ఎవరు? అది నేనే అన్నారు.

(గు) మరోసారి ఉపాసనీ వంటను తయారు చేయుచున్న సమయంలో నల్లని రూపుగల ముసలి వానిని చూసి బ్రాహ్మణేతరుడని భావించి వెళ్ళగొట్టాడు.

(రు) బాబా ఆ ముసలి వాని రూపంలో ఉంది నేనే అన్నారు.

ఉపాసనీ బాబా గొప్ప సాధకులే. కాని బాబా రావడమంటే తాను చూచిన రూపంతోనే వస్తారనే అంధకారభావాన్ని సర్వరూపాలలోను, సర్వజీవాలలోను అంతటా బాబా వ్యాపించి ఉంటారనే విజ్ఞానాన్ని బాబా కలిగింప చేసారు. బి.వి.దేవ్ విషయంలోను ఇదే కదా జరిగింది అనగానే, నీ సమన్వయము బాగుందని, బాబాను ఈ విధంగానే ఆలోచించు, అన్వేషించు మంచి జరుగుతుందని ఆశీర్వదించారు గురువుగారు.

– *డా॥ జి. సాయివరప్రసాదరావు*



వీటిని తొలగించినగాని పంట పూర్తిగా మనకు అందదు. కలుపుమొక్కలను అంధకారమును తొలగించు విషయములో సాధకుని సంరక్షించుటకు, జ్ఞానమును నిలుపు సమయములో గురువు ఈశ్వరుని వంటివారు. ఇలా కొంత సంభాషణ సాగిన తరువాత నాకు భాగవతములో నారదుడు గుర్తుకు వచ్చి, గురువుగారు "కృష్ణం వందే జగద్గురుం" అనే మాట భాగవత కాలం నాటిది (అంటే ద్వాపర యుగం) నారదుడంటేనే జ్ఞానమును ఇచ్చువాడని అర్థము.

అలాంటి మహానుభావుడు అష్టభార్యలతోనే అంతఃపురాలు అతలాకుతలమైపోతుంటే సామాన్య మానవుడు ఇన్ని వేలమందితో సంసార జీవనం ఎలా సాగిస్తున్నాడోనని అనుమానం. అంటే ఇక్కడ "గు" (చీకటి) కలిగింది. నారదుడు శోధించిన ప్రతి గృహంలోను శ్రీకృష్ణుడు దంపతీ సమేతుడై ఉండటాన్ని నారదుడు ఆశ్చర్యచకితుడై స్వామి పాదాలకు నమస్కరించబోవగా వారించి, జితేంద్రులైన మహర్షులు, ఇంద్రియాశక్తులమైన మానవులకు నమస్కరించరాదని వారు ఇక్కడ "రు" (వెలుగు), మానవరూపధారుడైనను మాయకు అతీతుడైనప్పుడు సర్వవ్యాపకత్వం, సర్వరూపధారణ, గురుత్వము కలుగుతాయి. కేవలం ఇంద్రియాదులను జయించుటే పరిపూర్ణత్వము కాదను జ్ఞాన బోధ చేసినాడనినాను. అప్పుడు గురువుగారు ఈ విధమైన ఆలోచన, అన్వయము, అన్వేషణ, బాబా పరంగా యోచించు. ఎక్కడ బాబా ఆరాధకునకు అంధకారము కలిగినదో, దానిని బాబా ఎలా తొలగించారో పరిశోధించమనినారు.

**శ్యామా విషయము :** బాబాపై శ్యామాకు ఎంత ప్రేమాభిమానములున్నవో, బాబా శ్యామాకు ఎంతటి సమున్నత స్థానమునిచ్చినారో, సాయిచరిత్ర పాఠకులకు సువిదితమే. సద్గురుని సన్నిధిలో కూడా కొంత మందికి, అవివేకము, అజ్ఞానము, అహంకారాలు ఎందుకు పెరుగుతాయో యోచించిన తెలియనగును. ఇక్కడ శ్యామాకు బాబాపై ఎంతగా ఎనలేని ప్రేమ ఉంటుందో, అంత చనువు ఉంటుంది. అలాంటి సందర్భంగానే బాబా సర్వజ్ఞుడని అంటారుగదా! అదెలాగుంటుందో చూద్దామని శ్యామాకు కలిగిన ఒక ఆలోచన.

(గు) దానికి తగినట్లుగానే ఒకరోజు ఎవరో బాబాకు రెండు రూపాయలు పంపారు. శ్యామాలో ఒక చిలిపి ఆలోచన వెంటనే వచ్చింది. ఈ రెండు రూపాయలు బాబాకు ఇవ్వను. బాబాయే తమంత తాముగా శ్యామా నాకు రెండురూపాయలు ఇవ్వమని ఎవరూ పంపలేదా? అంటే బాబా సర్వజ్ఞుడని తాను అంగీకరిస్తానని భావించెను.





అది లేకుండా కూడా ముందుకు వెళ్ళవచ్చు. కానీ మనలో చాలామందికి అది మనం కూర్చున్న కొమ్మను నరుక్కోవడంలాగా ఉంటుంది.

**భక్తుడు :** గురువుగారూ! నేను సహాయం కోసం బాబాను అడిగినప్పటికీ, ప్రార్థించినప్పటికీ నాకింకా నిస్సహాయంగా అనిపిస్తే నేను చెయ్యగలిగింది ఏమన్నా ఉందా? నేనలా ప్రార్థించి, ఎదురుచూస్తూ ఉండాలా?

**గురువుగారు :** నేను మీకు చాలాసార్లు చెప్పాను. మీలోని ఆ నిస్సహాయత అనే అనుభవమే సహాయం కోసం అడగడం. దానిని మీరు ఒక పద్ధతిగా, మాటల్లో వ్యక్తం చేయాల్సిన అవసరం లేదు. మీరు చెయ్యగలిగింది ఏమీ లేదు. ఒకవేళ మీరు చెయ్యగలిగింది ఏదైనా ఉంటే మీరు నిస్సహాయులు కారని అర్థం. **నేను చెయ్యగలిగింది ఏమీ లేదు అంటూనే నేను ఏం చెయ్యాలి అని అడగడం అర్థం లేని ప్రశ్న** కాబట్టి మీరు ఏమన్నా చెయ్యగలిగి వుంటే మీరు నిస్సహాయులు కారు. మీరు ఏమీ చేయలేరు గనుకే మీరు నిస్సహాయులు.

**భక్తుడు :** అప్పుడు నేనిక చెయ్యగలిగింది ఏమిటి?

**గురువుగారు :** (నవ్వుతూ...) మీరు ఏమీ చెయ్యలేరు – మీరు ఆ నిస్సహాయతను అనుభవించడం తప్ప మరేమీ చెయ్యలేరు, మీరు ఎంత నిస్సహాయులో తెలుసుకోండి. చాలామంది నిస్సహాయంగా ఉంటారు, కానీ ఆ విషయాన్ని వారు ఒప్పుకోరు. ఇదీ సమస్య. నేను మిమ్మల్ని దానిని అంగీకరించమంటున్నాను. మీ నిస్సహాయతను మీరు తెలుసుకోండి, స్పష్టంగా తెలుసుకోండి. అది చాలు. ఏమి జరగాలో, మీరు ఏం చేయాలో, మీకు సాయం ఎలా అందివ్వాలో ఆ విషయాలు బాబా చూసుకుంటారు. మీకు సాయం చెయ్యడానికి మీరు బాబాకు చేసే సాయం అంటూ ఏమీ లేదు. (నవ్వులు....)

**భక్తుడు :** వాచా వ్యక్తం చేయాల్సిన అవసరం లేదా? అడగాల్సిన అవసరం లేదా?

**గురువుగారు :** అది మీకు ఆ తృప్తిని ఇస్తే మంచిదే. అలా వ్యక్తం చేయడం మీ నిస్సహాయతను తెలుసుకుని, అంగీకరించడంలో భాగమైతే అది సరైనదే.వాచా వ్యక్తం చేయడంలో తప్పేమీ లేదు. అది ఒక విధమైన పద్ధతిలా, మీ నిస్సహాయతకు ఒకానొక వ్యక్తీకరణలా మారుతుంది. అంతే.

**భక్తుడు :** గురువుగారూ! మీరు నాకు సహాయం చేస్తున్నారా? చేస్తుంటే అది నాకెందుకు మరింతగా అనుభవం కావడంలేదు?

**గురువుగారు :** ముందుగా మీరు "గురువుగారూ! నాకు మీరు సహాయం చేస్తున్నారా? అని అడుగుతారు. అవును, నేను సహాయం చేస్తున్నాను, కానీ మీరు నేను చెయ్యట్లేదనుకుంటారు. ఒకవేళ మీరు నేను సహాయం చెయ్యడంలేదు అనుకుంటే, "మీరు నిజంగా అడుగుతున్నారా" అని అంటాను నేను. మీరు



నిజంగా అడుగుతున్నట్లయితే, మీరు ఏ రకమైన సహాయాన్ని అడిగారు? మీకు ఎటువంటి సహాయం కావాలి? మరి ఒకవేళ నేను మీకు సహాయం చేస్తే మీరు దానిని స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నారా? మీరు తీసుకోగలిగిన సహాయాన్ని నన్ను అడగండి. ఇక్కడ తాత్వికతకు చోటులేదు. ఇది చాలా స్పష్టం.

సమస్యేమిటంటే, సహాయం అడగటానికి చాలామందికి భయం. ముందు మనకు సహాయం కావాలని తెలుసుకోవాలి. నేను ఇంకో అడుగు ముందుకేస్తాను. మీకు నిజంగా సహాయం కావాలా? ముందు ఎవరి సహాయం లేకుండా మీకు కావలసిన దానిని సాధించడానికి ప్రయత్నించండి. మీకు మీరుగా సాధించడానికి ప్రయత్నించండి.

అలా ప్రయత్నం చేసిన తరువాత, “గురువుగారూ, నేను ప్రయత్నం చేసాను, నావల్ల కాదు, మీరు సహాయం చెయ్యండి” అని మీరంటే అప్పుడు సహాయం చెయ్యడానికి సిద్ధం – కానీ అప్పుడు మీరు సహాయాన్ని స్వీకరించాలి. కానీ జరిగేదేమిటంటే అప్పుడు అహం తలెత్తుతుంది. “నాకు మీ సహాయం అక్కరలేదు, నాకు నేను సహాయం చేసుకోగలను, అయినా నాకు అసలు సహాయం ఎందుకు? నాకై నేను సాధించగలను మీరు కాస్త ముందుకు నెడితే చాలు” అంటారు. (గురువుగారు నవ్వుతూ...) ఒకవేళ నేను కాస్త ముందుకు నెట్టినప్పటికీ అది నిజంగా నెట్టడం కాదేమో అనిపిస్తుంది. నిజంగా గురువుగారు ముందుకు నెట్టారా లేక నేను దానిని ఊహించుకుంటున్నానా అని సందేహిస్తారు. (నవ్వులు)

ముందు మనకు స్పష్టత కావాలి. మనకై మనం ఏమీచెయ్యలేమనే పరిపూర్ణమైన స్పష్టత రావాలి. సహాయం అడగటానికి అదే అర్హత. అప్పుడు సహాయం అలా అందితే అందించబడుతుంది. నూటికి నూరుశాతం ఆ విషయంలో సందేహం లేదు – మీరు స్వీకరిస్తారు. సాధారణంగా ఈ విషయంలో విఫలం కావడానికి, గందరగోళ పడటానికి, భయపడటానికి కారణం వారికి స్పష్టత లేకపోవడమే.

**గురువుగారు :** మీకు మీరు సహాయం చేసుకోలేరని తెలుసుకోగలిగితే, అప్పుడు మీరు ఎటువంటి సంకోచం లేకుండా సహాయం అర్థిస్తారు. “గురువుగారూ, మీరివ్వగలరా, మీరు సలహా ఇస్తారా... మీరిది చేస్తారా...” ఇది కాదు అడిగే పద్ధతి!! దీనికి బదులు మీరు డిమాండ్ చెయ్యాలి. “నాకివ్వండి, నేను మిమ్మల్ని భిక్ష అడుగుతున్నాను, మీ ముందు భిక్షగాళ్ళలో భిక్షగాడిలా నిలబడివున్నాను...” **అలాంటి నిజాయితీతో, అంత సంసిద్ధతతో, అవసరంతో అడగాలి.**

**గురువుగారు :** సహాయం అర్థించడమంటే అది దుఃఖంతోనో లేక నిరాశానిస్పృహలతోనో కూడుకుని ఉండకూడదు. అత్యంత నిస్సహాయస్థితిలోనే మీకు సహాయం అనుభవమవుతుంది. మీ నిస్సహాయతే





గురువు యొక్క అవసరము, ఆవశ్యకత, ఎలాంటి సమయాలలో, ఎలాంటి వారికి సాధనా పరంగా మూలస్థంభంగా గురువు ఎలా నిలబడుతారో ఒక కోణంలో వివరించేవారు. యోగులు, మహర్షులు, మన సాహిత్యానికి అందిన సాధకులు, వారికి ఏయే గురువు రక్షణ వలన వారికి కలిగిన దివ్యానుభూతులను మరో కోణంలో వివరించారు. గురువు యొక్క అవసరం లేకుండానే నేను లక్ష్యాన్ని పొందగలనని అహంకరించిన కొందరికి మరల గురువు ఎలా చేయూత, సహకారాలు అందించారో వివరించారు. ఆనాడు గురువుగారు వివరించిన అంశాలను పూర్తిగా వివరిస్తే కొండపల్లి కొండంత ఎత్తుగా, కొండవీడు కోటంత విస్తీర్ణంగా ఉంటుంది. ముచ్చట్లే కాబట్టి మూడుముక్కల్లో ముగిస్తాను.

గురువుగారు చెప్పిన విషయాలను శ్రద్ధగా మననం చేసిన తరవాత పూర్వపక్షంగా వేసే ప్రశ్నే నాకు తట్టలేదు. తార్కికంగాను గురువుగారు చెప్పినవి సరిపోయేవి. పూర్వపక్షం ఎలా చేయాలో యోచించి గురువుగారితో అన్నాను. ఏమిటి అన్నట్లుగా ప్రశ్నార్థకంగా నా వంక చూసారు. ఇప్పటి వరకు శాస్త్ర ప్రామాణికంగా, స్తోత్రాల నాధారంగా “గురువు”ను గూర్చి మీరు వివరించిన విధానం మాత్రం అసదృశ్యం అని, ప్రాయోగికంగా కూడా మీరు కొంత వివరణ ఇస్తే నాలాంటి సాధారణ వ్యక్తికి ఉపయోగి కాదా? అని అడిగాను.

ప్రాయోగికంగా మనం తెలుసుకోవాలనుకుంటే మహనీయులు, ముఖ్యంగా సాధకులు, ఇతిహాసాలు, కొంత పరిచయముండాలి. అప్పుడది మనకు సులభతరం కాగలదన్నారు. వారన్న వెంటనే మహాభారతంలోని ఉదంకోపాఖ్యానం; కౌత్యుడు మొదలగువారి చరితలు, వారి వారి గురువులు ఏ విధంగా అజ్ఞానం వైపుకు వెళ్ళనీయకుండా కాపాడిన అంశాలను ఉటంకించాను. బాబా పరంగా కూడా అలాగే యోచించు అన్నారు. శాస్త్రంలో “గు” అనే శబ్దానికి అంధకారమని, “రు” అను శబ్దానికి దానిని నిరోధించు వెలుగని ఉంది. గురువే బ్రహ్మ–అనగా గురువు యొక్క అనుగ్రహము వలనే సాధకునికి జ్ఞానం అనేది ఇవ్వబడును (బ్రహ్మ సృష్టి కర్త) ఇక్కడి బ్రహ్మ–జ్ఞానకర్త. కర్షకుడు పొలంలో నారును మాత్రం వేసి పంటకు కావల్సిన ఎరువును, తగిన సమయాల్లో నీళ్ళను వదలడము, పురుగుల వలన పంటకు చీడ పట్టకుండా రక్షణ చేయును. అదే విధంగా తాను ప్రసాదించిన జ్ఞానమనే పంటను రక్షణచేసి పెంచి పోషించు విషయంలో విష్ణువుతో సమానుడు. ఈ సమయంలోనే వెలుగు ప్రసాదించు సమయంలో చీకటి మాదిరిగా, పంటను పాడుచేయు కలుపు మొక్కలు పెరుగును.



## అలనాటి ముచ్చట్లు

మాగగా మాగగా మాగాయి పచ్చడికి మహత్తర రుచి, పుట్టిన పుట్టతేనె కొంతకాలమవ్వగా బహుతీపి. పులిహోర మరునాటికి పులుపు పట్టి పసందుగా ఉంటుంది. అదేమాదిరిగా మహనీయులు, మహానుభావులు, సాధనా స్వరూపులు చెప్పిన కొన్ని కమ్మని ఆధ్యాత్మిక విషయాలు అలనాటివైనా ఈనాటికి అవి ఎంతో మధురానుభూతులను, సాధకుల హృదయాలకు పండిన మామిడి పండంత రుచిగా ఆనంద పారవశ్యులను చేస్తున్నది.


1983లో ఉద్యోగరీత్యా వేంకటగిరికి వెళ్ళిన నాకు నాలుగు రోజులు గడచిన తరువాత బాలభానునివంటి తేజోమయులు, బంగారు వన్నెవంటి మేని ఛాయగలవారు, నును మీగడలతేలు మనస్సున్నవారు, దొరవోలె నా మనసు పట్టపగలే దోచిన నా నెలరేడు అయిన శ్రీశరత్‌బాబూజీగారితో పరిచయం, ప్రథమ దర్శనం అయ్యింది.

కాలమనే కడలిలో, సత్సంగమనే నావలో, భక్తి, ప్రేమ, గౌరవమనే తెడ్డుతో, “ఆధ్యాత్మికత” అనే గడకర్రతో సుదీర్ఘకాలం నావను నడిపిన మహనీయుడు, శ్రీశరత్‌బాబూజీగారు. బహుకాల ప్రయాణంలో అనేక మజిలీలు. ఒక్కొక్క మజిలీకి ఒక్కొక్క క్రొత్తదైన దివ్యమైన మధురిమలు, అనుభూతులు, అజ్ఞాన నివారణ, వాస్తవ నిరూపణల వంటివి ఆ పడవలో ప్రయాణం చేసిన సాధకులకు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీగారు అందించారు.

వేంకటగిరిలో ‘తాజ్‌మహల్’ అనే భవంతి రాజాగారిది. అందులో ఒక చిన్న గదిలో మా స్వామివారు మా కోసమా! అన్నట్లు బాడుగకు వచ్చారు. వారు వేంకటగిరిలో ఉన్నన్ని రోజులలో వేసవి సెలవులప్పుడు తప్ప మిగతా సమయంలో వారిని అంటిపెట్టుకుని ఉండేవాడిని. వారు ఎన్నో మంచి మంచి విషయాలను ‘బాబా’ పరంగా విశ్లేషించి చెప్పేవారు. దాని వలన ఎందరికో మేలు జరిగింది. నా మటుకు నాకు నన్ను వెంటాడినవి, అవగాహనకు రాని అంశాలకు వారి సన్నిధిలో సమాధానం లభించింది. ఈనాడు బాబాను గూర్చి తెలిసినవి, వారు తెలిపినవే. బాబాపై గురి కుదరటానికి మూలపురుషులు వారే! ఓనమాలు దిద్దించిన ఒజ్జయు వారే!

ఒకరోజు గురువుగారి సన్నిధిలో “గురువు” అనే అంశం ప్రస్తావనకు వచ్చింది. మధురాతి మధురమైన మంచి మంచి మాటలు వారు బాబా పరంగా వివరించారు. సుదీర్ఘంగా రెండున్నర గంటలు సాగిన సత్సంగ అనంతరం నాలోని అనుమానపు పిశాచి నన్ను ఆవహించింది.





మీకు సహాయం అనుభవంలోకి వచ్చేలా చేస్తుంది. ఆ తరువాత మీరు ఒక రక్షణ ఉన్నదన్న భావంతో జీవించగలుగుతారు. అప్పుడు నిస్సహాయులమనే భావం ఉండదు. మీకు పరిపూర్ణమైన అనుగ్రహం (సహాయం), ఆనందం అనుభవమవుతాయి. అప్పుడది (మీ నిస్సహాయత) మీకు ఆనందంగా, పరిపూర్ణంగా, ఉపయుక్తంగా ఉంటుంది. మనకు సహాయం యొక్క అవసరం ఎప్పుడూ ఉంది, మనకు సహాయం చెయ్యడానికి బాబా కూడా ఎప్పుడూ ఉన్నారు.

–శరశ్చంద్రికలు

## బాబూజీ - బాపూజీ

మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ మనందరితో ప్రేమగా పిలవబడే మహాత్మా! మహాత్మాగాంధీ!! బాపూజీ!! పరిచయం అవసరం లేని ఈ పేరు ప్రపంచమంతా కీర్తించబడే ఒక స్వాతంత్ర్య సమర నాయకుడు. ఆనాటి మేధావులకే కాదు, ఈనాటి వారికి కూడా అర్థం కాని ఒక ఆంతరంగిక విశ్లేషకుడు, జ్ఞాన భగవాన్ శ్రీరమణ మహర్షి నుంచి శ్రీబాబూజీ దాకా ఎందరో మహాత్ములచే అమితంగా ప్రేమించబడిన శ్రీగాంధీ మనలాంటి వారికి ఎందరికో ఆదర్శవంతుడు. అహింసతో మన ఇంటి వారిని, పక్క వారినే ఒప్పించలేని మనకు ఆయన జీవితం ఒక లోతైన డాక్టరేట్ కోర్సు! ఆ మహాత్ముని గురించి 150వ సంవత్సరంలో స్మరించుకునే అవకాశం రావడం శ్రీసాయినాథుని కృపావిశేషం.

శ్రీసాయినాథుని శరత్‌బాబూజీకి శ్రీగాంధీ పట్ల వుండే ఇష్టం గురించి మనందరికీ విదితమే. మహాత్మాగాంధీలోని పట్టుదల, కార్యదీక్ష గురువుగారు ఎంతో ఇష్టపడేవారు. అనన్యమైన ప్రేమ, అంతులేని సహనం, అకుంఠిత దీక్ష, కార్యసాధనపై తపన, సహజమైన ఆనందం, అపారమైన కరుణ, విశేషమైన విజ్ఞానం, లోతైన గాంభీర్యం, ఎడతెగని మౌనం, ఆకస్మిక చతురత లాంటి గుణాలెన్నో శ్రీబాబూజీతో పయనించిన వారికి ప్రస్ఫుటం, విస్పష్టం. కొంచెం ఆలోచించి జీవిత చరిత్ర దృష్ట్యా చూస్తే మహాత్మాగాంధీలో కూడా ఇలాంటి లక్షణాలు ఎన్నో కనిపిస్తాయి. గురువుగారు నియమానికి ఇచ్చిన ప్రాధాన్యత ఎంతో వున్నదని మనందరికీ తెలిసిన విషయమే. సాయిపథ ఆవిర్భావం నుంచి కూడా ఒక నియమం మనం పెట్టుకుంటే మనం ఎంతవరకైనా నడవడాన్ని గురువుగారు ఇష్టపడేవారు, ప్రోత్సహించేవారు! గురువుగారు మనం అంటిపెట్టుకున్న ఆదర్శాన్ని ఉత్తేజపరచడం చూస్తే గాంధీజీ జీవితం, ఆయన అహింస, సత్య, నియమాలను ఆజన్మ పర్యంతం ఆచరించి, ఆచరింప చేసిన జీవన విధాన సారూప్యం మనల్ని విస్మయ సంభ్రమాలకు గురిచేస్తుంది! ఈ



సారుప్యతను శ్రీబాపూజీ, శ్రీబాబూజీ జీవితాలలోని కొన్ని సంఘటనల ఆధారంగా అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాం. గాంధీజీ జీవితంలో చాలా సంఘటనలు ఆయన ఖచ్చితమైన అభిప్రాయాలకు అద్దంపడితే, చౌరీచౌరా ఉదంతం మకుటం వంటిది. దేశమంతా సహాయ నిరాకరణ ఉద్యమం (non - cooperation movement) చేస్తున్న సమయంలో ఒక చిన్న గ్రామంలో హింసకు పాల్పడడం జరిగింది. ఆ సంఘటనను మినహాయించి ముందుకు వెళ్ళి వుంటే స్వాతంత్ర్యం 1922వ సం॥లోనే వచ్చివుండేది అన్న అభిప్రాయం ఉంది. కానీ, అహింసా నియమం మీద రాజీలేని వైఖరితో గాంధీజీ ఆ ఉద్యమాన్నే ఆపేసారు! తద్వారా మనం స్వాతంత్ర్యం 1947 వరకు ఆగవలసి వచ్చింది. ఆ తరుణంలో ఆయన చెప్పిన మాట, "హింస ద్వారా సాధించుకునే ఔన్నత్యంలో నేను భాగస్వామిని కాను!" అని. అంటే గాంధీజీ లక్ష్యానికన్నా మార్గానికే ప్రధాన పీట వేశారు. శ్రీబాబూజీ చెప్పిన మాటల్లోనే "మనం లక్ష్యాన్ని చేరటం ఒక్కటే ముఖ్యం కాదు. ఈ లక్ష్యాన్ని శ్రీసాయిబాబా చూపిన శుభ్రమార్గంలో చేరుతున్నామా అనేది కూడా ముఖ్యమైనది". నిజానికి లక్ష్యం కంటే మార్గమే ప్రధానం. గురువుగారు చాలా సందర్భాల్లో మనలోని మార్పు గురించి మాట్లాడేవారు. ముక్తి, మోక్షం లాంటి వాటి కంటే శుభపరిణామం–'ఉద్ధరించుకోవడం' వంటి వాటికే చాలా ప్రాముఖ్యత వుండేది. ఆయన ఆలోచనల్లో మనం ఎంతో భక్తి భావంతో దర్శించే శిరిడీ కూడా మన ఉద్ధరింపులో భాగంగానే భావించుకునేవారు. బాబా దగ్గరికి ఎందుకొస్తున్నాం అంటే మనల్ని మనం ఉద్ధరించుకోవడానికి అనేవారు.

సాయిబాబాని అనన్యంగా ఆరాధించిన శ్రీబాబూజీ, గాంధీజీని ఇష్టపడే వారిని ఇంతకు ముందు తెలుసుకున్నాం. అయితే శ్రీసాయిబాబా, గాంధీజీ మార్గాలు కనీసం కొన్ని అంశాలలోనైనా వేరు, ఇంకా చెప్పాలంటే విరుద్ధం! సత్యశోధనకు జీవితాంతం కృషి చేసిన గాంధీజీ తనలోని తపనను పెంచుకునే నిమిత్తం ఉపవాసానికి ఉపక్రమించేవారు. మహాత్ముని ఆచరణ అలావుంటే శ్రీసాయిబాబా, "తినరా తిను! ఏం శివరాత్రి" అని ఉపవాసాన్ని భంగం చేసేవారు. ఇలా ఇద్దరు మహాత్ముల విరుద్ధ ఆచరణ స్వభావాలకు సంబంధించిన ప్రశ్నకు సమాధానం కావాలంటే ఆ మహాత్ముల గురించి క్షుణ్ణంగా తెలిసిన ఇంకొక మహాత్ముని ఆశ్రయించడం తప్పనిసరి. శ్రీబాబూజీని ఇలాంటి ప్రశ్నలతో ఆశ్రయించిన ఒక గురుబంధువుతో గురువుగారి సంభాషణ క్రింద పొందుపరుస్తున్నాను.

ప్ర: గాంధీజీ ఆత్మకథ చదువుతున్నప్పుడు passionని పెంచుకోవడానికి ఆయన ఉపవాసం





చేసేవారని తద్వారా ఆయన తపనని పెంచుకునేవారని ఉంది. బాబా ఉపవాసాలని ఖండించేవారని తెలుసుకున్నాం. ఈ రెండింటిలో ఏది follow అవ్వాలి?

జ: **Passion నీకొక fashion అయిపోయింది (నవ్వులు). గాంధీజీ ఆచరించిన ఉపవాస మార్గం కరెక్టే. అది మంచి మార్గమే! తప్పేమీ కాదు. బాబా చెప్పింది కూడా ఆచరింపదగినదే. ఆకలితో వుండడం కంటే ఏదో ఒకటి తినడం కూడా కరెక్టే. ఉపవాసమార్గంలో నువ్వెంత శక్తి, సామర్థ్యాలతో ఉండగలవనే దానిమీద ఆధారపడి వుంటుంది. అక్కడ ఫలితం నీ తృప్తి మీద ఆధారపడి వుంటుంది. బాబామార్గంలో అయితే అన్నీ బాబా చూసుకుంటారు.** *(గురువుగారి సమాధానం పూర్తైన తరువాత సరైన సమాధానం అర్థంకాక, మీరైతే ఏది follow అవుతారు అని వచ్చిన ఆంతరంగిక ప్రశ్నకు సమాధానంగా గురువుగారు. "నేనైతే బాబానే follow అవుతాను" అన్నారు నవ్వుతూ).*

ప్ర: ఏదైనా సాధించాలంటే తపన కావాలి. బాబా మార్గంలో మనలోని తపన ఎలా పెరుగుతుంది?

జ: **ముందు ఒకటేదైనా తీరుతుంది. బాబా తీరుస్తారు. దాన్ని ఇంకా పొందాలి అనే కోరిక కలుగుతుంది. దానిలో నుంచి తపన ఇంకా పెరుగుతూ పోతుంది. ఆ పెరిగిన తపన ఇంకా ఆనందాన్ని ఇస్తుంది. అలా పెరిగిన ఆనందం, ఇంకా ఎక్కువ ఆనందాన్ని పొందాలి అనే తపన పెరిగేలా చేస్తుంది.** (ఆనందంగా ఉండండి! ఆనందాన్ని దూరం చేసేవాటిని దూరం చేసుకోండి అంటారు శ్రీబాబూజీ).

ఇక చరమాంకం! శ్రీబాబూజీని చూసి "గాంధీతాత, గాంధీతాత" అని సంతోషంతో కేకలు పెట్టారు శ్రీకోటిస్వామి. 1948లో పరమపదించిన శ్రీగాంధీ 1954లో విజయదశమినాడు బాబా విగ్రహావిష్కరణతో జన్మించిన శ్రీబాబూజీ ఒకరేనా అనే ప్రశ్న మనలో ఉదయించేలా వుంది శ్రీకోటిస్వామి సంబోధన. "We are not just pieces of iron, but rusted pieces" అని శ్రీబాబూజీ మనల్ని గురించి అన్నారు. ఈ rusted piecesకి ఎప్పటికీ అర్థంకాని పై విషయాన్ని వదిలేద్దాం! అలాంటి మనల్ని కూడా శ్రీసాయిబాబా భక్తిరసం వైపు పరుగులు పెట్టించగల మహితాత్ములు శ్రీబాబూజీ అయితే, ఆడవారు గడప దాటని ఆ కాలంలో జండా పట్టుకుని "వందేమాతరమ్!" అని వీధులలో నినదించేలా స్ఫూర్తిని నింపిన మహనీయుడు మహాత్మా!

గాంధీజీ జీవిత పర్యంతం ఆచరించిన సత్యం అనే నియమం, "నీవెప్పుడూ సత్యాన్నే అంటిపెట్టుకో! నీవెక్కడున్నా నీవెంటే ఉంటాను" అన్న శ్రీసాయి చెప్పిన ప్రధాన సత్యాన్ని తలపింపచేస్తుంది.

**– 'గురుకృప' కోసం 'పవన్', బెంగుళూరు**